ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 సంచిక : 1 సెప్టెంబర్ 2006

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫ్రైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు .......... 05-01-06
పిప్పర ................ 09-04-06
భీమవరం .......... 12-04-06
పాతాళమెరక ..... 28-11-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## అపక్వచిత్తులను ఆమడదూరంలో ఉంచే గురుపన్నాగాలను పక్వచిత్తులే పరికిస్తారు

సద్గురువు తన వద్దకు వచ్చే కొత్త వారి పూర్వచరిత్రను పరికించి వారికీ తనకు ఉండే అనుబంధాన్ని భక్తితో పెంచుకొంటాడని నిశ్చయించుకొంటే, అతను ఎక్కడ ఉన్నా ఆయన రక్షిస్తాడు. తనతో అనుబంధం ఉండని భక్తులను వారి సుగుణాలకు తగ్గ ఆశీస్సులు ఇచ్చి పంపుతారు. వారు చేసే ఈ ఆధ్యాత్మిక శిక్షణలో ఊరికే సంఖ్యను పెంచరు. అర్హతగలవారు వస్తే వారిని తిరస్కరించరు. దత్తాత్రేయులవారు కారణ భక్తిగలవారి బారి నుండి తప్పించుకొనుటకు మగువలను, కల్లు కుండలను కల్పించుకొనేవారు. గోచీతో కూరలు తరుగుతూ ఉండే శ్రీ రమణులు ఈ కారణ భక్తులు వస్తే మోకాళ్ళు ఒత్తుకుంటూ ఉండేవారు. చూచిన ఆ భక్తులు పెదవి విరిచి వెళ్ళిపోయేవారు. గురువులు వాటిని రక్షక వలయంగా ఏర్పాటు చేసుకొంటారు. శ్రీ రామకృష్ణులు "ఎత్తైన పీటమీద గ్యాస్ లైటు పెడితే దాని కాంతి చాలా దూరం చేరుతుంది, కాని పీట చుట్టూ క్రింద చీకటి ఉంటుంది. అలాగే సద్గురు సమీపంలో కొన్ని కళంకాల నీడలు గల సంఘటనలు ప్రకృతి ప్రభావం వల్ల జరగవచ్చును. ఈ చీకటి ఏమిటి? అనేవారు సత్యాన్ని గ్రహించలేరు. గురువు యొక్క జ్ఞానకాంతి ఖండాంతరాలకు వ్యాపించి అక్కడ ఉన్న సహృదయులు ఆత్మశాంతిని పొందుతారు" అన్నారు. ఆవు పొదుగులో ఉన్న పాలను అక్కడ ఉన్న గోమార్లు తాగలేవు, అలాగే పద్మంలోని మకరందాన్ని దాని దగ్గరలో ఉన్న కప్పలు త్రాగలేవు, బెక బెక మంటాయి కాని ఎక్కడినుంచో వచ్చిన

తుమ్మెదలు స్వీకరించి సుఖిస్తాయి. యోగ్యత లేకపోతే గురువు సమీపంలో ఉన్నా అనుగ్రహం పొందలేరు. ఒక రకమైన పక్షి పున్నమి చంద్రుని ఆహ్లాదాన్ని రెప్పవెయ్యకుండా రాత్రి అంతా చూచి ఆనందిస్తుంది, చంద్రునిలోని మచ్చలు గుర్తించదు. అలాగే గురు సన్నిధిలోని కళంకాల నీడలను భక్తుడు గుర్తించక పూర్ణచంద్రుని వంటి గురువు ముఖారవిందాన్ని భక్తులు చూస్తూ కాలగతి తెలియకుండా ఆనందిస్తారు. గురుగీత అంటోంది "విషమ పరిస్థితి వచ్చినప్పుడు నిజమైన బంధువు గురువు ఒక్కడే, గురువు కన్నా అధికమైనది ఏదీ లేదు. అది శివుని శాసనం. శిష్యుని తాపాలను దోచుకొనే గురువు దొరకటం చాలా కష్టం" అని. మనలోని దోషాలను ఎవరు ప్రేమ మార్గంలో సరిచేస్తాడో అతడే ప్రజల హృదయాలలో మహోన్నతస్థానం అలంకరిస్తాడు. భగవాన్‌ని ఒకరు మీరంటే వారికి మంచి అభిప్రాయం లేదు అంటే "ఉండాలని ఎక్కడా సిద్ధాంతం లేదు. వారు శాంతంగా సుఖంగా ఉంటూ ఆత్మానుభవం పొందాలి కావలసినది అది" అన్నారు. జ్ఞాని సమాజాన్ని అలా ప్రేమిస్తాడు. జ్ఞానం సంపాదిస్తే సరిపోదు దాన్ని పది మందికీ పంచాలి ఆతడే జ్ఞాని. జ్ఞాని బోధల వల్ల స్వార్థభావాలు, ద్వేషం నశించి త్యాగబుద్ధితో జీవితాన్ని గడపటం వల్ల సమాజానికి సద్గురువు ఎంతో మేలు చేస్తాడు. అన్ని దానాల్లోకి జ్ఞానదానం గొప్పది. గురువు వద్దకు విషయ వాసనలు ఉన్నవారు, బ్లాక్ మార్కెట్ దార్లు, దొంగలు, త్రాగుబోతులు, హంతకులు వచ్చి తన పాపకార్యానికి ప్రాయశ్చిత్తం కోసం అర్థిస్తారు. వారు ఆశ్రయం అడిగితే నావల్లకాదు అనటం కుదరదు, ప్రేమించే మాతృ హృదయాన్ని వికశింపచేయటంలోనే ఉంది నిజమైన ఆనందం అని. గురువు వారిస్థాయికి దిగకుండానే చేయి అందించి పైకి తీసుకొని వస్తాడు. బుద్ధుడు, క్రీస్తు, రమణుడు, రామకృష్ణులు ఇలా చేసిన వారే. మనలోని బహుజన్మల పాపాల ముసుగులను చూచి వదిలే స్థితి ఉంటే మనం ఎవ్వరమూ గురు సన్నిధికి వెళ్ళే అర్హత లేనేలేదు. శ్రీ నాన్నగారు అంటారు "నీవు ముసుగు ముసుకుల్లో ఉన్నావు కాని మంచి వాడవు అనుకొంటున్నావు" అని. ప్రతి జీవికీ ఊపిరి ఎంత అవసరమో, సద్గురువు కూడా అంతే అవసరం. గురు కీర్తి గురుతత్వం ఎంత తెలుసుకొన్నా ఇంకా వినాలి అనిపించే జీవి గురుతత్వాన్ని సాధిస్తాడు. నాకు అన్ని తెలుసు ఇకచాలు అనుకొనేవాడు ఏమీ సాధించలేడు. చెడు భావాలకు సహజంగా బలం ఎక్కువ. రాక్షసుల కన్నా దేవతలు బలహీనులు. ఫలితాన్ని ఇచ్చే మొక్కల కన్నా కలుపు మొక్కలే వేగంగా పెరుగుతాయి. అబద్ధాలు పరుగెత్తుకొంటూ వస్తాయి, నిజాలు తరువాత కొంత ఆలస్యంగా కుంటుకుంటూ వస్తాయి. ఒక చెడ్డమాట గాయం చేస్తుంది, ఒక మంచి మాట గాయానికి మందు. ఇతరుల పొరపాట్లను చూచి నవ్వుకొంటారు. అది అంతంలేని

వారి అహంకారమనే తప్పులు వారికి తెలియవు. కోర్టు శిక్ష అనుభవించి పరివర్తన చెందని వారిని గురువు సరిచేస్తాడు. నవ్వుతూ చేసే పాపకార్యాన్ని ఏడుస్తూ అనుభవించే రోజు సిద్ధంగా ఉంటుంది. ఇతరులను విమర్శించటం ద్వారా తాను అధికుడను అనుకొంటూ అహంకారం పెంచుకొనే వారు తిరోగతే. అది ఒక జాడ్యం. సాధకులు దీన్ని గమనించాలి. ప్రేమ, కరుణ, దయ, సానుభూతి, సేవ, శ్రద్ధ, కపటం లేకపోవటం, సున్నితత్వము, ఎరుక అనే బీజాలను మన మనఃక్షేత్రాలలో విత్తుకోవాలి. అవి పుష్పించాలంటే గురు సహచర్యం అవసరం. గురుబోధతో వారు అంచెలంచెలుగా ఎదిగి సత్యాన్ని అందుకొంటారు. మనలను తిట్టేవాడు పైసా ఖర్చు లేకుండా మన దుష్కర్మలను కడిగివేస్తాడు. షేక్స్పియర్ అన్నారు "ప్రతీమనిషీ చెప్పే దాన్ని విను, కానీ కొద్దిమందికే సమాధానం ఇయ్యి. ప్రతీ మనిషి ఆక్షేపణను, మందలింపును విను, కాని దానిపై నీ అభిప్రాయాన్ని నీలోనే ఉంచుకో" అని. అంటే ఆ ఆక్షేపణకు సమాధానం చెప్పే అర్హత లేదని అర్థం. దానిని మన జీవిత సంఘటనల్లో అన్వయించుకొంటే జీవితం అంతా సవ్యంగా సాగిపోతుంది. మన మనో నేత్రాలకు ప్రేమ రాహిత్యం అనే పచ్చకామెర్ల రోగం కలిగినప్పడే దోషాలు కనబడతాయి. "ఎవరైతే అపసవ్యంగా నడుస్తారో వారికే నష్టం. మనం బాధపడవలసిన పని ఏముంది? పాపాన్ని ద్వేషించు, పాపిని ద్వేషించకు" అనేది పురాతన సూక్తి. గురువు సంస్కారాల మీద వాత పెడతాడు. బాహ్యంగా కనిపించే స్థూల విషయాల మీద కాదు జీవన్ముక్తిని మనఃస్థితిని అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. వారు చేసే సహాయం మన బుద్ధికి అందదు. ఆయన జీవనమే లోకానికి కళ్యాణప్రదం. సద్గురు దర్శనమే సాధకునకు పెద్ద ఊరట. సాధకుని దుఃఖాలు అన్నీ అప్రయత్నంగా మరుగున పడతాయి. ధైర్యము, ఉత్సాహం, ఆనందం కలుగుతాయి. అవి అనుభవానికి సబంధించినవి. ఋజువులు చూపటం సాధ్యం కాదు. మూగవానికి మిఠాయి పెట్టి రుచి ఎలా ఉంది అంటే ఏమీ చెప్పలేడు. బుద్ధి జడం బుద్ధికి అతీతమైన సద్గురు అమృత కిరణాల స్పర్శ పాడుబుద్ధి తెలుసుకోలేడు. వాటి విషయంలో హేతువు కోరే సంస్కారం హీనమైనది. అది పరి ప్రశ్న కాదు, పాడు ప్రశ్న. అందుకే వేమన అన్నారు "ముద్దు గుమ్మకేల మొసలి మొగుడు, మది వశము కాక విటుని వలన చిక్కు, వెఱ్ఱి మొద్దునకున వేద శాస్త్రములు" అని. నిజ భక్తునికి కావలసినది గురురూపాన్ని, గురునామాన్ని స్మరిస్తూ ఆత్మానందాన్ని అందుకోవాలి. అక్కడ ద్వైతం లేదు, పేచీలు లేవు, పరమ శాంతే. మన జీవిత గమ్యం అదే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 17-06-06, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తిమార్గంలో ఒకరూపం ఉంటుంది, నామం ఉంటుంది. ఆరూపాన్ని ధ్యానించుకొంటాము, నామాన్ని స్మరించుకొంటాము. రూపధ్యానం కంటే నామస్మరణ గొప్పది. రాముడి రూపంకంటే రామనామం గొప్పది అని చెపుతారు. అయితే మన మనస్సు నామం మీద నిలబడనప్పడు రూపం మీద పెట్టుకోవటం మంచిది. మొత్తం మీద మన మనస్సు అక్కడ స్థిరంగా ఉంటోందో, లేదో జాగ్రత్తగా చూసుకోవాలి. దేహం, లోకం, ఇతరులు, దేవుడు మొత్తం వీటిని కల్పించేది మనస్సే, మనస్సు అణిగితే ఏమీ లేదు. ఎన్ని శాస్త్రాలు చెప్పినా, ఎంతమంది మహర్షులు చెప్పిన మనోనాశనం గురించి చెప్పారు. మనోనాశనం అవ్వకుండా లోపలఉన్న శాంతి, ఆనందం మనకు అందదు. సుఖం, శాంతి, ఆనందం మన హృదయంలోనే ఉంది. అక్కడ ఉంది అని తెలియక మనం బయట వెతుకుచున్నాము. ఆగుడిచుట్టూ, ఈగోపురం చుట్టూ తిరగటం, నదులలో స్నానాలు చేయటం ఇలా ఏవో పనులు చేస్తూ హృదయంలో అన్వేషణ మానివేసి లోకం అంతా తిరుగుతూ ఉంటాము. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది అని భగవాన్ చెప్పారు. మరి ఈ అరుణాచలం మాట ఏమిటి అని అడిగితే ఈ దేహం నేను అని దేహంతో తాదాత్మ్యం పొందటం ఎంత నిజమో అది కూడా అంతే నిజం అని చెప్పారు.

నేను అనే మొదటితలంపుకు, మూలతలంపుకు ఇతర తలంపులు వస్తాయి. నా చేతిలో ఉన్న బంతిని వదిలేస్తే అది కిందకు పడిపోతుంది. ఎందుచేతనంటే దానికి ఆలంబన పోయింది. అలాగే మూలతలంపుకు వచ్చే ఇతర తలంపులను ఆపుచేసుకొంటాము అనుకో, ఇతర తలంపుల సపోర్టు ఆగిపోతే మూలతలంపు లోపలకు ఉపసంహరింపబడుతుంది. భక్తిమార్గంలో మనకు ఇష్టమైన రూపం మీద, నామం మీద మనస్సును నిలబెట్టి ఉంచినప్పడు దానికి వచ్చే ఇతర తలంపులు ఆగిపోతాయి. జ్ఞానమార్గంలో రూపం, నామం అక్కరలేదు. నీకు నేను అనే తలంపు ఉంది కదా. ఈ నేను అనే తలంపుకు ఇతర తలంపులు వచ్చినా ఇదొక తలంపు, అదొక తలంపు, ఈ తలంపుకు ఆ తలంపు వస్తోంది. ఈ నేనును విచారణ చేయటం వలన కూడా ఈ నేను లోపలకు వెళ్ళేకొలది దానికి వచ్చే ఇతర తలంపులు ఆగిపోతాయి. భక్తిమార్గంలో అయినా, విచారణ మార్గంలో అయినా మూలతలంపుకు వచ్చే ఇతర తలంపులు ఆగిపోతాయి. అయితే విచారణ మార్గంలో రూపం, నామం అక్కరలేదు. భక్తిమార్గంలో ఒకరూపం, నామం ఉండాలి. మూలతలంపు లోపల నుండి వస్తోంది అని

మనకు తెలుసుకొని అది ఎక్కడ నుండి వస్తోందో మనకు తెలియదు. అది ఎక్కడనుండి వస్తోందో మనకు తెలియాలి అంటే అది ఉదయించిన చోటును మనం చూడగలగాలి. ఆ మూలతలంపు దాని మూలం లోనికి వెళ్ళి ఎప్పుడైతే ఐక్యమయిపోయిందో అప్పుడు ఆమూలతలంపు మూలంలో ఉన్న వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అదే చైతన్యం. ఓ అరుణాచలేశ్వరుడా! నేను ఇక్కడకు రావటం అహంకారంతోనే వచ్చాను. (ఆయనకు అహంకారం లేకపోయినా మన విషయం ఆయన మీద పెట్టుకొని చెపుతున్నాడు) అహంకారం వలన వచ్చే అరిష్టాలు, ఇబ్బందులు, బాధలు, జన్మలు అవి అన్నీ నాకు తెలియచెప్పి, బోధించి అందులోనుండి నన్ను విడుదల చేసావు అన్నారు భగవాన్. ఒక వస్తువును నేను గట్టిగా పట్టుకొన్నాను అనుకోండి నాచేతిలో నుండి మీరు లాగటం కష్టం. అహంకారం దేహాన్ని గట్టిగా చుట్టబెట్టుకొని ఉంది, దాని పిడికిలిలో నుండి బయటకురావటం చాలా కష్టం, అది మనలను తొందరగా విడిచిపెట్టదు. మీరు ఎన్ని గుళ్ళు చుట్టూ తిరిగినా, ఎన్ని యాత్రలు చేసినా, ఎన్ని నదులలో మునిగినా ఒక బ్రహ్మజ్ఞాని యొక్క దయలేకుండా మీకు బ్రహ్మజ్ఞానం కలిగే అవకాశం లేదు అని శాస్త్రం చెప్పింది.

ఏ వస్తువుకయితే మరణంలేదో ఆ వస్తువు తాలుక ఎరుక నీకు కలిగేవరకూ నీకు సందేహాలు ఆగవు, మరణం ఆగదు, పుట్టుక ఆగదు. నేను ఏదైతే కాదో అదే నేను అనుకొంటున్నాను. ఓ అరుణాచలేశ్వరుడా! అందులో నుండి నిన్ను విడుదల చేసి, నా మానసిక చాపల్యాన్ని ఆపుచేసావు, నోటి వాగుడు ఆపుచేసావు, నా హృదయాన్ని శాంతితో ఆనందంతో నింపావు. ఇంక నువ్వు లేవు, నేను లేను. ఇంక మాట్లాడటం ఏమిటి? మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కష్టం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది, లాభం వస్తుంది, నష్టం వస్తుంది, ఇది అంతా భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. మీకు ఏదైనా కష్టం వచ్చినా, సుఖం వచ్చినా, నష్టం వచ్చినా ప్రతీదానికి రీజన్ ఉంది. భగవంతుడికి తెలియకుండా ఏదీ జరగటానికి అవకాశం లేదు. అందుచేత దేనికి దుఃఖపడవద్దు. దీని గురించి బెంగపెట్టుకొన్నాము అని కొంతమంది చెపుతూ ఉంటారు. ఆ సంఘటన భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. అందుచేత మీరు బెంగపెట్టుకోవలసిన పని లేదు. ఆ సంఘటన అలా జరగటం వలన మీకు మనో వికాశం కలుగవచ్చు, మీకు వైరాగ్యం పెరగవచ్చు, నీకు బాహ్య దృష్టి తగ్గిపోయి అంతర్దృష్టి పెరగవచ్చు, ఇది అంతా ఈశ్వరుడు చూసుకొంటాడు. అందుచేత ఇది అంతా మన మంచికోసమే జరుగుతోంది అని అర్థం చేసుకొంటే నీవు అదృష్టవంతుడవు. అక్షరమణమాలలో భగవాన్

అంటారు కష్టం వచ్చినప్పుడు నీవు నాకు తోడుగా ఉన్నప్పుడు ఆకష్టం కష్టం కింద నాకు అనిపించటం లేదు. నిన్ను కట్టుకొన్నాక నేను ఎక్కడ మిగులుతాను. ద్వైతంలో ఉన్నప్పుడు కష్టసుఖాలు అనుభవిస్తున్నాము అనుకొంటాము. నేను అనే తలంపు ఉన్నప్పడే కష్టం, సుఖం, లాభం, నష్టం అన్నీ. నిన్ను ఎప్పడైతే కట్టుకొన్నానో అప్పడే ఈ నేను అనే తలంపు పోయింది. కష్టాలు సుఖాలు అనేవి ఏమీ లేవు ఉన్నది ఒక్కటే. నువ్వు మిగిలావు నేను అంటూ లేను. అంటే బాహ్యంగా అశాంతికి కారణాలు ఉన్నా లోపల డిస్ట్రబెన్స్ లేదు అని చెప్పకుండా చెపుతున్నాడు.

లోపల నీరు ఉంటే బుడగలు వస్తాయి, నీరే లేకపోతే బుడగలు లేవు. లోపల నీకు దేహము నేను అనే తలంపు ఉన్నప్పడే ఇతర తలంపులు వస్తాయి, దేహము నేను అనే తలంపు నీకు లేనప్పడు ఇతర తలంపులు కూడా లేవు అంటున్నారు భగవాన్. నేను అనే తలంపు లేకపోతే మనం ఉండమేమో అని మనకు అనిపిస్తుంది కాని గాఢనిద్రలో నేను అనే తలంపు లేనప్పడు కూడా మనం ఉన్నాము. గాఢనిద్రలో దేహానికి సంబంధించిన తలంపులు కాని, లోకానికి సంబంధించిన తలంపులుకాని, దేవుడికి సంబంధించిన తలంపులు కాని ఏమీ లేవు, ఇవి ఏమీ లేకుండా అక్కడ మనం ఉన్నాము. గాఢనిద్రలో ఉన్న స్థితి ఇప్పడు కూడా ఉంది. దేహము నేను అనే తలంపు గాఢనిద్రలో అణిగిఉంది, జాగ్రదవస్థ లోనికి రాగానే నేను అనే తలంపు వస్తోంది, నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. ఈ తలంపులు అన్నీ ఉన్నప్పడు కూడా ఆ స్థితి ఉంది. ఈ తలంపులు అన్నీ కాలి బూడిద అయిపోతే గాఢనిద్రలో ఉన్న స్థితి జాగ్రదవస్థలో నీకు తెలుస్తుంది. మన మనస్సు బాహ్యముఖానికి వెడుతూ ఉంటే అదే అహంకారం కింద మారుతుంది, లోపలకు వెళితే ఆత్మలో ఐక్యమవుతుంది. దుఃఖం అంతా మూలతలంపులోనే ఉంది. మూలతలంపు నశించింది అనుకోండి దుఃఖం కూడా లేదు. గాఢనిద్రలో ఉన్న నేను నిజమైన నేను, దానికి హద్దులు లేవు, పరిమితులు లేవు. ఆ నేను ఇప్పడు కూడా ఉంది, అది అనుభవంలోనికి తెచ్చుకొంటే అది నీ కడసారి జన్మ. గాఢనిద్రలో మనం అందరం సుఖంగానే ఉన్నాము. జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి ఆ సుఖం ఎందుకు కనిపించటం లేదు. దేహముతో పరిమితమైన నేను, దానికి వచ్చే ఇతర తలంపులు లోపల ఉన్న సుఖాన్ని మనకు అందనివ్వటం లేదు. ఓ అరుణాచలేశ్వరుడా! జీవుడి యొక్క దేహబుద్ధిని తొలగించటమే పనిగా పెట్టుకొన్నావు, నీకు ఇంకో పని లేదు. ఆపని చెయ్యటం కోసమే సర్వేశ్వరుడవు అయిన నువ్వు ఈ కొండ రూపం ధరించి వచ్చావు. ఎవరు నా నోటిలో మన్నును కొట్టి నా బ్రతుకు హరించినది

ఎవరు అరుణాచలా! నాకు దేహం మీద, లోకంలోని విషయాల మీద చాలా ఇష్టాలు ఉన్నాయి. గత జన్మలనుండి సహజంగా వస్తున్న దేహం మీద ఉన్న రుచి, లోకం మీద ఉన్న రుచి పోగొట్టటానికి నా నోటిలో మట్టిని కొట్టేసి నన్ను నాకు కాకుండా చేసేసి నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు అరుణాచలేశ్వరుడా అంటున్నారు.

భిన్నభావన వలన భయం వస్తుంది. మీరు వేరు, నేను వేరు అనుకొంటే మిమ్మల్ని చూస్తే నాకు భయం వేస్తుంది, నన్ను చూస్తే మీకు భయం వేస్తుంది. మనందరం ఒకటే ముద్ద అయితే, మీరు నేను వేరు కాదు ఒక్కటే అని అనుభవంలో తెలిసినప్పుడు ఇంక భయం ఎక్కడ ఉంది. భయం వలన నష్టం ఏమిటి అని మీరు అడగవచ్చు. భయంవలన దుఃఖం వస్తుంది, అశాంతి వస్తుంది, పునర్జన్మలు వస్తాయి. మన లోపల అహంకారం ఉంది, అహంకారం చుట్టబెట్టుకొనే వస్తువులు బయట ఉన్నాయి. అహంకారం ఒక వస్తువును పట్టుకొంటూ ఉంటుంది, ఒక వస్తువును విడిచిపెడుతూ ఉంటుంది. నువ్వు పార్టీ కోసం పార్టీని ప్రేమించటం లేదు. నీకోసం పార్టీని ప్రేమిస్తున్నావు. నీకోసం పార్టీని ప్రేమిస్తున్నావు కాబట్టి నువ్వు పార్టీ మారుస్తున్నావు లేకపోతే పార్టీ మార్చవలసిన పని ఏమిటి? నీ స్వార్థానికి అనుకూలంగా ఉంటే నీ అత్తగారు మంచి ఆవిడ, నీ స్వార్థానికి అనుకూలంగా లేకపోతే ఆ అత్తగారే చెడ్డ ఆవిడ. ఆవిడను ప్రేమించినా, ద్వేషించినా నీకోసమే చేస్తున్నావు అంటే నేను కోసమే చేస్తున్నావు. ఆ నేను ఎవడు? సాధన అంటే ఇష్టం లేనివారు రేపు చేసుకొందాము అంటారు. ఏరోజుకారోజే రేపు అంటారు. రేపుకు రూపు లేదు. వారు బద్ధకస్తులు. ఇంకవారు ఏమి బాగుపడతారు. సోమరితనానికి అలవాటుపడినవాడు ఇహానికి పనికిరాడు, పరానికి పనికిరాడు అని ఋగ్వేదం చెపుతోంది.

మీకు ఇష్టంలేని సంఘటనలు ఒకోసారి జరుగుతూ ఉంటాయి. ఆ సంఘటనలు మీకు ఇష్టం లేదని దేవుడికి తెలుసు, మీకు తెలుసు. కాని భగవంతుడు మిమ్మల్ని ప్రిపేర్ చేయటానికి, మీ మనస్సును సమాయత్తం చేయటానికి గొప్ప వెలుగులోనికి మీకళ్ళు తెరిపించటానికి కొన్ని మీకు ఇష్టంలేని సంఘటనలు అలా జరిగేటట్లు చూస్తాడు. మీరు చాలా చెడ్డవారు అనుకోండి. మీరు మంచివారు, మీరు మంచివారు అని నేను అంటాను అనుకోండి చివరకు నేను ప్రమాదంలో పడతాను. ఆ మాయలో నుండి మళ్ళించటానికి భగవంతుడు కొన్ని సంఘటనలు క్రియేట్ చేస్తాడు. చెడు స్నేహాలు చేసే బదులు పులి నోట్లో నీ తలకాయను పెట్టు అని చెపుతారు. పోతే ఈ శరీరమే పోతుంది, భవిష్యత్‌లో నీకు నీచ జన్మలు రావు. చెడు స్నేహాల వలన చెడ్డవాసనలు, చెడ్డ సంస్కారాలు వస్తాయి, వాటిని బట్టి భవిష్యత్‌లో నీచమైన

జన్మలు వచ్చి, నీచమైన లోకాలకు వెళ్లే అవకాశం ఉంది. మంచి వాళ్ళు మనకు గురువులే, చెడ్డవారు మనకు గురువులే. మంచివారు మనకు నోటితో చెప్పకపోయిన మంచిగా ఎలా ఉండాలో వారిని చూడటం వలన మనకు తెలియజేస్తూ ఉంటారు. చెడ్డవారు మేము చెడ్డవాళ్లము అని నోటితో చెప్పకపోయినా మా జోలికి రావద్దు, చెడుకు దూరంగా ఉండండి అని మనకు తెలియజేస్తూ ఉంటారు. మంచివారితో సహవాసం వలన అన్నీ పొందుతావు, మోక్షాన్ని కూడా పొందుతావు. సజ్జనసాంగత్యం వలన వారి సమక్షంలో మోక్షం యొక్క ప్రాముఖ్యత నీకు తెలుస్తూ ఉంటుంది. నీవు మోక్షాన్ని పొందమని వారు ఏమీ చెప్పరు, వారి సహవాసం వలన దాని ప్రాముఖ్యత నీకు తెలుస్తుంది, వారి సహాయ సహకారం వలన నీ సాధనతో పనిలేకుండా నీ అంతట నీవు దానిని పొందుతావు.

జ్ఞానం నీలోపల ఉంది, అది నీవు తెలుసుకోకుండా ఎవరో ఇతరులు నీకు అడ్డురావటం లేదు, ఏదైతే నీవు నేను, నేను అంటున్నావో ఆ దేహగతమైన నేనే అడ్డువస్తోంది. ఆ నేను అనే తలంపు నీకు లోపలనుండే వస్తోంది, అది వచ్చాక అంతా వస్తోంది. నువ్వు లోకంలో చాలా విషయాలు పరిశీలించటానికి అలవాటు పడ్డావుకదా, లోకవిచారణ, దేహవిచారణ నీకు ఎక్కువ అయిపోయింది కదా. ఇలా లోకవిచారణ చేసేబదులు ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోంది, ఎలా వస్తోంది, ఇది గాఢనిద్రలో కనబడటం లేదు, జాగ్రదవస్థలో వచ్చేస్తోంది, ఈ నేను ఎవడు అని ఈనేనును విచారణ చెయ్యి. నీ మొఖాన్ని అటు లోకం వైపుకు తిప్పేబదులు ఇటుతిప్పి నేను అనే తలంపు యొక్క మూలాన్ని వెదుకు, ఈ జన్మలోనే నీవు తరిస్తావు. నీ మనస్సును బహిర్ముఖం చేసేబదులు అంతర్ముఖం చెయ్యి. ఈ నేను అనే తలంపు నీకు బయటనుండి రావటం లేదు కదా లోపల నుండే వస్తోంది, అది ఎక్కడ నుండి వస్తోందో పరిశీలించు, దాని పోకడ నీకు తెలుస్తూ ఉంటుంది. ఇప్పుడు ఏదైతే నేను, నేను అనుకొంటున్నావో ఆ నేను నువ్వు కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని రామకృష్ణుడు చెప్పారు. మీరు వైద్యం చాలాబాగా చేసారు అంటే నాకు సంతోషం వస్తోంది, మీరు ట్రీట్‌మెంట్ సరిగా చేయకపోవటం వలన మావాడు చనిపోయాడు అని కొంతమంది అంటున్నారు, అప్పుడు దుఃఖం వస్తోంది, వీటిలో నుండి బయటపడటం ఎలాగ అని ఒక డాక్టరుగారు అడిగారు. మీకు ఏ నేనుకయితే సంతోషం వస్తోందో, ఏ నేనుకయితే దుఃఖం వస్తోందో ఆ నేను నిజం అని మీరు అనుకొన్నంతకాలం వెయ్యి జన్మల తరువాత కూడా అందులో నుండి మీరు బయటపడలేరు అని చెప్పాను. ఆ నేను మనకు బంగారం కింద కనిపిస్తోంది, ఇంక మనం దానిని ఎలా విడిచిపెడతాము. ఓ అరుణాచలేశ్వరుడా! పవిత్రమైన మాట లేకుండా, పవిత్రమైన ఆలోచన లేకుండా, పవిత్రమైన మనస్సు లేకుండా నిన్ను

పొందాలనుకోవటం, అది ఎలా సాధ్యం. ఒకవేళ అలా పొందాలి అనుకొన్నా అది సాధ్యపడుతుందా? భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన చెయ్యమని చెప్పిన పనులు చెయ్యి, ఆయన వద్దని చెప్పిన పనులు మానివెయ్యి. అప్పుడు వాడి స్వరూపం నీకు ఇస్తాడు, అదే మోక్షం.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఏదైతే ఎప్పుడూ ఉందో అది ఎప్పుడూ ఉంటుంది, నువ్వు గుర్తించినా గుర్తించకపోయినా అది ఎప్పుడూ ఉంటుంది. కాని వచ్చింది మటుకు పోతుంది, పోయింది వస్తూ ఉంటుంది, ఇది అంతా స్వప్నమే. నీదేహప్రారబ్ధాన్ని బట్టి డబ్బు వస్తుంది, నీ తెలివితేటలను బట్టిరాదు, ఇది జ్ఞాపకం పెట్టుకోండి. దేహప్రారబ్ధాన్ని బట్టి డబ్బు, చదువు, పదవి ఇవి అన్నీ వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఇవన్నీ నిజం కాదు. కొంతమందికి చేసినవి అన్నీ కలిసిరావచ్చు, కొంతమందికి కలిసిరాకపోవచ్చు, ఇది అంతా స్వప్నమే. అలా కలిసివచ్చినా, కలిసిరాకపోయినా నీ అండ నాకు ఉన్నప్పుడు ఈ ప్రారబ్ధం నన్ను ఏమి చేస్తుంది అరుణాచలేశ్వరుడా! అంటున్నారు. ఎప్పుడైతే భగవంతుడిని సపోర్టుగా తీసుకొన్నామో, మన మనస్సు ఎప్పుడైతే భగవంతుడి మీద నిలబడి ఉంటుందో అప్పుడు మంచిప్రారబ్ధం వచ్చినా పొంగురాదు, చెడుప్రారబ్ధం వచ్చినా కుంగిపోవు, ఈశ్వరుడు ఒక్కడే నిజం ఇది అంతా నిజం కాదు అని నీ అండర్‌స్టాండింగ్‌కు అందుతూ ఉంటుంది. నువ్వు ఏదో నొల్లుకోవటం కాదు, నువ్వు చేయవలసింది ఒక్కటే. ఏ నేను ఉంటే అన్నీ ఉన్నాయో, ఆ నేను యొక్క మూలాన్ని తెలుసుకోవటమే, అదే నిజమైన విచారణ. మాకు వ్యాకులత వస్తోంది, అనేక సమస్యలు వస్తున్నాయి, అశాంతి వస్తోంది అని ఏదో చెపుతుంటారు దీనికి భగవాన్ ఏమంటున్నారు అంటే వీటన్నింటికి ఏ నేను అయితే కారణమో అదిపోతే వ్యాకులత లేదు, అశాంతి లేదు, సమస్యలు లేవు. రైలులో ప్రయాణం చేసేవాడు, వాడి పెట్టెను రైలులో పెట్టకుండా, నెత్తిమీద పెట్టుకొంటే అది వాడి తప్పా, రైలు తప్పా, వాడిదే తప్పు. ఇదంతా నేనే చేస్తున్నాను నా వలననే అవుతోంది అనే భావన వలన బాధలు వస్తున్నాయి. ఇది అంతా ఈశ్వరసంకల్పాన్ని బట్టి జరుగుతోంది అని నీకు అర్థమయినప్పుడు నీకు దుఃఖం లేదు.

అనుకొనేది జీవుడి సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ప్రతిసంఘటన ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలో అలా జరుగుతూ ఉంటుంది. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే మీ దేహం ద్వారా ఏపని జరగవలసి ఉందో అటువైపుకు మీ దేహాన్ని మళ్ళిస్తూ ఉంటాడు. దేవుడి కంటే వీడు భిన్నంగా ఉన్నానని అనుకొంటాడు. ఆ వేరుభావనలో నుండి వీడికి దుఃఖం ప్రారంభమవుతుంది, అశాంతి ప్రారంభమవుతుంది. జీవుడు అనేవాడు అసలు లేడు అని మీకు అర్థమవ్వాలి. జీవుడు పుట్టలేదు అంటున్నావు, జీవుడు పుట్టకపోతే దుఃఖం ఎలా వస్తుందని గౌడపాదుడిని ఒకరు అడిగారు. జీవుడు అనేవాడు అసలు లేడు, ఉన్నాడని నీవు అనుకొంటున్నావు, అది నిజం అనుకోవటం వలన

నీకు దుఃఖం వస్తోంది. వాడు నిజం కాదని నీకు తెలిస్తే ఇప్పుడే నీకు దుఃఖం నశిస్తుంది. గౌడపాదుడు చెప్పిన ఈ మాటను మనం చేతితో పట్టుకొంటే, అది మనకు అర్థమయితే ప్రపంచాన్ని జయించవచ్చు అంటే మీరు ఈ లోకం విడిచి వెళ్లకముందే లోకవాసన పూర్తిగా నశిస్తుంది. తాడులో పాము లేదు కాని తాడు పాము కింద కనిపిస్తోంది అనుకోండి, అలా ఎంతకాలం అయితే కనిపిస్తోందో అంత కాలం భయం విడిచిపెట్టదు. ఉన్నది బ్రహ్మం ఒక్కటే. అది జీవుడికింద నీకు కనిపిస్తోంది, అలా ఎంతకాలం అయితే కనబడుతుందో అంతకాలం దుఃఖం విడిచిపెట్టదు, భయం విడిచిపెట్టదు. ఈ సృష్టిని అంతా భగవంతుడు నిర్మించి, భగవంతుడు అంతర్యామిగా ప్రవేశించాడు అని చెపుతారు, దీనికి గౌడపాదుడు ఒప్పకోలేదు. దానికి రెండోది ఉంటే కదా ప్రవేశించటానికి, ఉన్నది ఒక్కటే. ఆ బ్రహ్మం నీకు తెలియకపోవటం వలన అదే లోకంగా కనిపిస్తోంది, అదే జీవుడిగా కనిపిస్తోంది, అదే నామరూపాలుగా కనిపిస్తోంది, అంతకంటే ఏమీ లేదు. మన మనస్సులో ఉన్న మలం అంతా పోయింది అనుకో, అప్పడు మిగిలేది శాంతి, ఆనందం, నువ్వే మిగులుతావు.

నాకు భక్తిని ప్రసాదించండి, జ్ఞానాన్ని ప్రసాదించండి అని అడుగుతున్నాడు. వీడికి జ్ఞానం సంపాదించాలనే జిజ్ఞాస ఉంది. జిజ్ఞాస ఉంటే, తపన ఉంటే నువ్వు వద్దన్నా జ్ఞానం వచ్చి నిన్ను వరిస్తుంది. నాకు భక్తికావాలి, భక్తికావాలి అని నీవు అనుకొంటావు అనుకో, నీకు నిజంగా భక్తి కలిగితే, నువ్వు ఏ నేనునయితే పోగొట్టుకోవాలో అది అందులో కరిగిపోతుంది, దాని గురించి నీవు పెద్ద తంటాలు పడనక్కరలేదు. నేను లేను, ఉన్నది నీవే అనే పరాభక్తి నీకు కలిగింది అనుకో నీ మనస్సు పూర్తిగా ఆత్మలో లీనమైపోతుంది, అప్పడు నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మశాంతి నీకు తెలుస్తుంది. నువ్వు ప్రత్యేకంగా అడగనక్కర లేదు, స్వచ్ఛందంగా వచ్చేస్తాయి. భగవాన్‌కు మరణానుభవం కలుగకముందు ఆయన శాస్త్రాలు ఏమీ చదవలేదు, పెద్దలు చెపుతూ ఉంటే వినలేదు. ఆయనకు 16వ సంవత్సరంలో మరణానుభవం కలిగింది. నిజంగా దేహం చనిపోయింది, ముక్కులోగాలి ఆగిపోయింది, ఈ శరీరం చనిపోయినప్పడు నేను చనిపోవాలి కదా, నేను చనిపోకుండా లోపల ఉన్నాను అనే అనుభవం ఆయనకు కలిగింది. నేను అఖండంగా ఉన్నాను, నేను లేనిచోటు అంటూ లేదు అనిపించింది, ఈరకంగా ఆయనకు ఆత్మానుభవం కలిగింది, కొన్ని క్షణాల కాలంలో ఆయన జ్ఞాని అయిపోయాడు, ఇది దేవ రహస్యం. మీ దేహానికి 40 రోజులు అన్నం పెట్టకపోతే అది చనిపోతుంది అలాగే దేహంతో తాదాత్మ్యం పొందే నేనుకు ఆహారం అందకుండా చేస్తే అది చనిపోతుంది, ఇంక పునర్జన్మలు లేవు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది, అది దొంగ నేనుకు ఆహారం. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తారు అనుకోండి,

మీకు దుఃఖం వస్తుంది, అది దొంగ నేనుకు ఆహారం. మన ఇంద్రియాల ద్వారా దానికి ఆహారం అందుతూ ఉంటుంది, అది మనం కట్ చేయాలి. పద్మజ ఇప్పుడుదాకా శాంతిగా ఉంది, కాలేజీ ప్రెసిడెంట్‌గారు నిన్ను తిడుతున్నారు అని నేను చెపుతాను అనుకోండి, నేను చెప్పే మాటలు చెవుల ద్వారా మనస్సు వింటుంది. కళ్ళు ఎర్రబడిపోతాయి, మొఖం చిన్నదైపోతుంది, ఇదంతా ఒక్క క్షణంలో జరిగిపోతుంది. ఇది ఎందుకు వస్తోంది? నేను చెప్పిన మాటలను చెవులద్వారా ఏ మనస్సు అయితే వింటోందో ఆ మనస్సు నిజమని పద్మ అనుకొంటోంది. అందుచేత ఇన్ని వికారాలు వస్తున్నాయి. ఆ మనస్సు నిజం కాదు అని అర్థమయితే విన్నా వికారం రాదు. ఆ వినే మనస్సు నిజంకాదని పద్మకు అర్థమయ్యే వరకు వంద జన్మలు ఎత్తినా అశాంతి తప్పదు, దుఃఖం నశించదు. ఇంద్రియాలు కుదురుగా ఉండవు, ఇటువంటి మాటలు అన్నీ లోపలకు మోసుకొనిపోతాయి. మోసుకొని వెళ్లినా ఫరవాలేదు, ఆ వినేవాడు నిజంకాదు అని మనకు అర్థమైతే చెవులు విన్నా దాని ప్రభావం మన మీద ఉండదు. ఈ ఒక్క పాయింటు మీకు అర్థమైతే మీరు ఇంటికి వెళ్ళేలోపు దుఃఖం నశిస్తుంది. కాలిపోయిన తాడు కూడా కంటికి తాడులాగే కనిపిస్తుంది కాని ఆ తాడుతో మనం ఎవరినీ బంధించలేము. అలాగే నీ మనస్సు సత్యం అనుకొన్నప్పుడు అది నిన్ను బంధిస్తుంది, అది అసత్యమని నీకు అర్థమైనప్పుడు ఏదీ నిన్ను బంధించదు, అది గుల్ల అయిపోతుంది.

మీరు పది లక్షలు పెట్టి గుడి కట్టించమంటే కట్టిస్తారు కాని విచారణ చెయ్యమంటే చెయ్యరు. ఎందుచేతనంటే గుడి కట్టించటం తేలిక, విచారణ చేయటం కష్టం. మీకు పూర్వపుణ్యం లేకపోతే మీరు విచారణ చెయ్యలేరు. భగవంతుడు అంతర్యామిగా లేకుండా ఏ శరీరం రాదు. మీ అత్తగారు మిమ్మల్ని తిడుతున్నారు అంటే మిమ్మల్ని తిట్టమని మీ అత్తగారిని భగవంతుడు గిల్లుతున్నాడు ఎందుచేతనంటే మీకు సహనం పెంచటానికి, హృదయం యొక్క లోతులు పెంచటానికి, నిన్ను పవిత్రుడిని చేయటానికి భగవంతుడు ఎవరో ఒకరిని ఉపయోగించుకొంటాడు. ఆపరేషన్ చేసేటప్పుడు రెండు రోజులు ముందు నుండి రోగిని సిద్ధం చేస్తారు, అన్ని పరీక్షలు చేస్తారు తరువాతగాని ఆపరేషన్ చేయరు. అలాగే నీకు జ్ఞానం ఇచ్చేముందు భగవంతుడు నిన్ను పవిత్రుడిని చేసి అప్పుడు జ్ఞాన సింహాసనం మీద కూర్చోబెడతాడు. మనలను రజోగుణం నుండి సత్వగుణం లోనికి పంపటం కోసం కొన్ని సంఘటనలు క్రియేట్ చేసి అప్పుడు నీలో సత్వగుణం పెంచి, హృదయం యొక్క లోతులు పెంచి, నిన్ను పవిత్రుడిని చేసి, హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళే శక్తిని, వైరాగ్యాన్ని ఇచ్చి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. ఒక్కసారి గురువు మిమ్మల్ని అనుగ్రహించాడు అనుకోండి, ఈ జన్మలోనో రాబోయే జన్మలోనో మీకు మోక్షం వచ్చి తీరుతుంది, మీకు మోక్షం వచ్చేవరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 10-07-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గురువు అనుగ్రహం ఉంది అంటున్నారు, అది మాకు అర్థంకావటం లేదు, దానిని అర్థం చేసుకోవటానికి ఇప్పుడు మేము ఏమి చెయ్యాలి? గురువు అనుగ్రహం ఉందని అనుకోవటం వేరు, ఉండటం వేరు. మీరు ఆరోగ్యంగా ఉండటం వేరు, ఆరోగ్యంగా ఉన్నారని మేము అనుకోవటం వేరు. గురువు అనుగ్రహం మీకు అర్థమైతే మీరు ఇలా ఎందుకు ఉంటారు, మీరు జ్ఞానులు అయిపోతారు. గురువు అనుగ్రహం ఇప్పుడు మీకు అర్థమవ్వటంలేదు, ఇప్పుడు మీరు ఉన్న స్థితిలో అర్థమయ్యే ప్రశ్నలేదు. ఎందుచేతనంటే దానిని అర్థంచేసుకోవటానికి కొంత అర్హత, యోగ్యత ఉండాలి, కొంచెం మైండ్‌లో ప్రిపరేషన్ ఉండాలి. మీ మనస్సుకు అర్థం అయ్యినా, అర్థం కాకపోయినా గురువు అనుగ్రహం ఉంది. అది మీ ఇష్టాల మీద, అయిష్టాల మీద ఆధారపడి లేదు. ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆయన మీకు కనిపిస్తున్నా ప్రకాశిస్తున్నాడు, కనిపించకపోయినా ప్రకాశిస్తున్నాడు. నీ మొఖం అటుతిప్పితే కనిపిస్తాడు, తిప్పకపోతే కనిపించడు. మనలో పెద్దలోపం ఏమిటి అంటే గురువు అనుగ్రహం అర్థంచేసుకోవటానికి తగిన అర్హత, యోగ్యత పట్టించుకోవటానికి మనం ప్రయత్నం చేయటం లేదు, ప్రయత్నం ఉంటే అసలు మీరు ఇలా ఉండరు. ఎవడైతే కష్టపడతాడో వాడికే కష్టం విలువ తెలుస్తుంది. ఒక జ్ఞాని విలువ ఇంకొక జ్ఞానికి తెలుస్తుంది కాని ఎంత ప్రయత్నం చేసినా జ్ఞాని యొక్క విలువ అజ్ఞానికి తెలియదు. అసలు లౌకిక మాటలే మనకు అర్థంకానప్పడు ఇంక దేవుడి అనుగ్రహం మనకు ఎలా తెలుస్తుంది. గురువు అనుగ్రహం తెలియటానికి ఎంతో కొంత వైరాగ్యం ఉండాలి. వైరాగ్యం లేకపోతే ఇప్పడు కాదు కోటి జన్మలు ఎత్తినా అది మీకు అర్థం కాదు. సబ్జక్టు అర్థం చేసుకోవటానికి మీకు ఎంతో కొంత మెంటల్ మేకప్ ఉండాలి. పునాది లేకుండా మీరు పది అంతస్థుల మేడ కట్టేస్తే తాత్కాలికంగా సంతోషించినా గాలివాన వస్తే పడిపోతుంది పునాది లేనిది ఏదీ నిలబడదు. నేను చెపుతూ ఉంటే మీరు సంతోషిస్తున్నారు కాని దానిని మీరు సొంతం చేసుకోవటానికి ఎవరూ ప్రయత్నం చేయటం లేదు.

ప్రపంచంలో అసలు దుఃఖం లేదు. అయితే దుఃఖం ఎందుకు వస్తోంది? మనస్సు చలించటం వలన దుఃఖం వస్తోంది. మనస్సు చలించటానికి మూడు దోషాలు చెపుతారు. మలదోషం, విక్షేపదోషం, ఆవరణ దోషం. ఇవి మూడు మనస్సులో ఉన్నాయి. ప్రతీ మనిషీ ఏది చేసినా నేను చేసాను అనుకొంటాడు. ఆ నేనే గర్వం అన్న సంగతి మనకు తెలియదు. ఆ

నేనును విడిచిపెట్టి గర్వం లేదు, ఏదీ లేదు. ఆ నేనును మనం విడిచిపెట్టము అనుకోండి గర్వం కూడా మనలను విడిచిపెట్టదు. ఎదుటివారు మంచివారా, చెడ్డవారా అనేది వదిలెయ్యండి, మనల్ని మనం లోతుగా పరిశీలన చేసుకోవాలి. మనం మాట్లాడే మాటలో పవిత్రత ఉంది అనుకో, చేతితో చేసేపనిలో పవిత్రత ఉంది అనుకో నీ చుట్టూ ఉన్నవారు చెడ్డవారు అయినా నీకు ఏమీ ఇబ్బంది లేదు, నీకు దుఃఖం రాదు. మేము చాలా మంచి వారము అని కొంతమంది అనుకొంటారు, మరి వారికి దుఃఖం ఎందుకు వస్తోంది. మనస్సు చలించిందా దుఃఖం వచ్చి తీరుతుంది. శరీరం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ ఈ శరీరం చనిపోయాక సూక్ష్మ శరీరాన్ని అంటిపెట్టుకొని మలదోషం, విక్షేపదోషం, ఆవరణదోషం ఈ మూడు దోషాలు ప్రతిజన్మకు వచ్చేస్తాయి. ఈ మూడు దోషాలలో ఒక్కదోషం ఉన్నా కూడా మీకు గురువు యొక్క అనుగ్రహం అర్థంకాదు, నువ్వు ప్రయత్నం చేసినా గురువు అనుగ్రహం నీకు అందదు.

గురువు అనుగ్రహం మనకు అందటం లేదు అంటే మనకు వివేకం లేదు, వైరాగ్యం లేదు, బుద్ధి సూక్ష్మత లేదు, ముముక్షత్వం లేదు, నీ కోణంలో నుండి చూస్తే ఏమీలేదు పెద్ద సున్న. ఈ పెద్ద సున్నలకు గురువు అనుగ్రహం ఎలా అర్థమవుతుంది, అర్థమయ్యే సమస్యే లేదు. మీకు అర్థమవ్వటం లేదు కాబట్టి లేదు అని అనుకోవద్దు. గురువును ఎంత మాత్రం ప్రేమించకుండా గురువు అనుగ్రహం పొందాలి అని చూస్తున్నారు, మీరు అందరు గట్టికారులు. గురువును ప్రేమించకూడదు, గురువు అనుగ్రహం వర్షం కురిసినట్లు మన మీద కురిసేయాలి అనుకొంటున్నారు, ఇది పెద్ద మోసం. గురువు మీద ప్రేమ లేకుండా, గురువుతో మానసికఅనుబంధం లేకుండా గురువు దయ మనకు వచ్చేయాలి అంటే మనలను మనం మోసం చేసుకొంటున్నాము అనే చిన్న విషయం కూడా మీకు అర్థమవ్వటం లేదు. గురువు అంటే ఆత్మ, గురువు అంటే బ్రహ్మం. బ్రహ్మం ఎవరికి తెలియబడాలంటే వారికి తెలియబడుతుంది. మీరు గట్టికారులే గాని మీకంటే బ్రహ్మం ఇంకా గట్టికారి. ఆ బ్రహ్మంను ఎవరు ప్రేమిస్తున్నారో తెలియకుండా బ్రహ్మం ఉందా? బ్రహ్మంకు తెలియని విషయం అంటూ ఏమీ లేదు. మీకు బ్రహ్మం మీద ప్రేమ లేదు, బ్రహ్మం ఒకటి ఉంది అని కనీసం విశ్వాసం లేదు, మీరు విశ్వాస హీనులు. కాని బ్రహ్మం మీకు తెలియబడాలి అనుకొంటున్నారు. అది ఎలా సాధ్యం. మనకు ఎంత అయితే అర్హత ఉందో అంతే మనకు వస్తుంది. జీవుడు యొక్క మూలంలోనికి, జీవుడు ఏ స్వరూపంలో నుండి అయితే వచ్చాడో ఆ స్వరూపంలోనికి జీవుడిని నెట్టటం ఒక్క గురువుకే సాధ్యం. మీకు స్వరూపజ్ఞానం కలిగేవరకూ జన్మలు వెంటాడతాయి, దుఃఖం వెంటాడుతుంది. మనం కానిదానిని అవును అనుకొన్నంత కాలం ఏ జన్మకు ఆ జన్మ శిక్ష అనుభవించవలసిందే.

పరమాత్మ గీతలో ఏమనిచెప్పాడు అంటే నేను ఏదైనా చెపుతాను అనుకో ఆశ్చర్యంగా చూస్తావు, ఆశ్చర్యంగా వింటావు ఎందుచేతనంటే నీకు ఉన్న రాంగ్ ఐడెంటిఫికేషన్ వలన, రాంగ్ థింకింగ్ వలన నువ్వు ఏదిగా ఉన్నావో దాని గురించి నేను చెపుతూ ఉంటే ఆశ్చర్యంగా చూస్తావు. సబ్జక్టు అర్థం చేసుకోకుండా నేను అది సాధిస్తాను, ఇది సాధిస్తాను అంటారు, ఏమి సాధిస్తారు. సబ్జక్టు అర్థం చేసుకోవటం కూడా ఒక పనే అని మీకు తెలియటం లేదు. ఏదో చెయ్యటం వలన మోక్షం రాదు. మీరు మంచి పనిచేస్తే పుణ్యం వస్తుంది, అది అనుభవిస్తే పోతుంది. పాపఫలం, పుణ్యఫలం అన్ని కాలాలలో ఉండవు, అనుభవిస్తే అవి పోతాయి. గురువు యొక్క టీచింగ్‌ను అర్థం చేసుకోవాలనే ప్రయత్నం లేదు, ఆయనతో మానసిక అనుబంధం లేదు, ఆ కోణంలో చూస్తే మనందరము సున్నలము కాని మనకు ఆత్మజ్ఞానం వచ్చేయాలి. గురువు అనుగ్రహం తెలియటం లేదు అని అడుగుతున్నారు, గురువు అనుగ్రహం పొందటానికి అసలు అడిగినవాడు చేసే సాధన ఏమి ఉంది, ఏమి ప్రయత్నం చేస్తున్నాడు. గురువు ముద్ద చేసి మీనోట్లో పెడితే కనీసం మీరు మింగటం అయినా చేయాలి కదా. గురువు అనుగ్రహం అర్థం కావటం లేదు, దానికి మేము ఏమి చేయాలి అంటున్నారు. వారు చేసేవి అన్నీ మర్చిపోతే గురువు అనుగ్రహం తెలుస్తుంది. అడిగినవారు మంచి పనులు చేసి ఉండవచ్చు, చెడ్డపనులు చేసి ఉండవచ్చు. ఆ మంచి చెడ్డా రెండూ వదిలేస్తే అప్పుడు గురువు అనుగ్రహం కలుగుతుంది. వంట గదిలో పొగవస్తూ ఉంటే ఆ గోడలు ఎలా మసిబారిపోతాయో అలాగ మనం అవసరం లేని మాటలు మాట్లాడుతూ ఉంటే మన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. ఈ భక్తులు అనుకొంటారు ఏదో చేయటం వలన జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటున్నారు కాని ఏదో చెయ్యటం వలన ఏదో రావచ్చును గాని ఆత్మజ్ఞానం వచ్చే సమస్య లేదు, రాదు, రాదు. ఈతరాని వాడు ఈత నేర్పుతాను అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? వాడు ఎలాగ ఈత నేర్పడు, వీడు నీటిలో పడి చస్తాడు. ఏదో చెయ్యటం వలన ఏదో వస్తుంది, అది అనుభవిస్తే పోతుంది, దీనికి లోపలఉన్న ఆత్మకు ఏమీ సంబంధం లేదు. వారిని ఏమీ చెయ్యవద్దు, ఊరక ఉండమని చెప్పండి.

మనం చాలా ఉన్నాయి అనుకొంటున్నాము కాని ఉన్నది ఒక్కటే అని చెపుతున్నారు ఏమిటి? ఉన్నది అదే, అది తప్పించి ఏమీ లేదు. ఆత్మను తెలుసుకోకుండా నువ్వు లోకం దృష్టితోటి, దేహం దృష్టితోటి ఆలోచిస్తే చాలా విషయాలు ఉన్నాయని నీకు అనిపిస్తుంది. నువ్వు ఆత్మను తెలుసుకొన్నాక మాత్రమే అది తప్పించి ఏమీ లేదని నీకు తెలుస్తుంది, అప్పటి వరకు నీకు తెలిసే అవకాశం లేదు, అది నువ్వు పుస్తకాలు చదివి సంపాదించే జ్ఞానం

కాదు. సబ్జక్టు అర్థం చేసుకోకుండా మేము ఏదో సాధన చేసుకొంటున్నాము అంటే అది సున్న, మీకు ఏమీ రాదు, చివరకు నడుము నొప్పి మిగులుతుంది. మమ్మల్ని ఏమి చెయ్యమంటారు చెరువు తవ్వించమంటారా, నుయ్యి తవ్వించమంటారా, గోడ కట్టించమంటారా అని ప్రతీవాడు అంటాడు. ఎందుకు ఇలా అలవాటు పడిపోయారు అంటే దీనికి కారణం ప్రతీ మనిషికీ లోకవాసన ఎక్కువ ఉంటుంది. లోకవాసన ఉన్నవారు లోకం దృష్టితో మాట్లాడతారు, లోకంలో ఏదో పని చేసేస్తే జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటారు. మీకు లక్ష వేల కోట్ల డబ్బు ఉన్నా జ్ఞానం రాదు. ఎక్కడ ఏది కట్టించినా దొంగ నేనును డెకరేట్ చెయ్యటమే. లోకంలో ఎక్కడైనా ఏదైనా చేస్తే చేయండి దాని వలన జ్ఞానం వస్తుందని ఎదురుచూడకండి, ఎదురు చూడటం వలన జ్ఞానం ఎలాగు రాదు, బిపి వస్తుంది. వారు ఏపని చేసినా లోకం దృష్టితో చేస్తారు, ఇది లోకం వాసనలో నుండి వచ్చిన ప్రశ్న. లోకానికి సంబంధించిన మనుష్యులకు శబ్దం మీద ఉన్న ఇష్టం నిశ్శబ్దం మీద ఉండదు. ప్రాపంచిక జ్వరానికి అదొకటే గుర్తు. మీకు వంద భాషలలో పాండిత్యం ఉందనుకోండి, కోట్ల కొలది డబ్బు ఉంది అనుకోండి అంత మాత్రంచేత ఆత్మజ్ఞానం వస్తుందనుకోకండి, ఇప్పటి వరకు సృష్టిలో ఎవరికీ అలా రాలేదు, భవిష్యత్‌లో కూడా రాదు. మీకు అర్హత ఉన్నప్పుడు, యోగ్యత ఉన్నప్పుడు మిమ్మల్ని సమీపించటానికి ఈశ్వరుడు ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు.

ఏ వస్తువునయితే మనం పొందుదామనుకొంటున్నామో దాని మీద మనకు కొంచెం అయినా ప్రేమ ఉందా? దాని మీద మనకు ప్రేమ లేదు అన్న సంగతి కూడా మనకు తెలియటం లేదు. మన బుద్ధిలో ఉన్న బలహీనతలలో నుండి బయటకు రాకపోతే నీకు వైరాగ్యం లేదు అంటున్నాడు పరమాత్మ. వైరాగ్యం లేనివాడికి ఈశ్వరానుగ్రహం ఎలా తెలుస్తుంది. ఈ శరీరం నాది, ఈ మనస్సు నాది, ఈ తెలివి తేటలు నాయి అనుకొంటూ, ఇలా నువ్వు కాని వాటితో కలిసి తిరుగుతూ ఉంటే నేను చెప్పిన విషయాలు నీకు ఆశ్చర్యంగా ఉంటాయి అంటున్నాడు పరమాత్మ. మీకు ఎప్పుడైనా శాంతి కలుగుతోంది అనుకోండి, జ్ఞానం తాలుక వైభవం కొంచెం తెలుస్తోంది అనుకోండి అది మీ తెలివి తేటల వలన కాదు, మీ మనస్సు చేసింది కాదు, అది గురువు అనుగ్రహం, అది తెలిసినవాడు ధన్యుడు. కంచి పరమాచార్య దగ్గర నలుగురు తమిళియన్స్ ఉన్నారు. ఒకడు ఇంకొకడితో ఇంగ్లీషులో మాట్లాడుతున్నాడు. అప్పుడు పరమాచార్య అన్నారు నువ్వు ఎవరితోనైతే ఇంగ్లీషులో మాట్లాడుతున్నావో వాడికి ఇంగ్లీషు రాదని నీకు తెలుసు, అది తెలిసి కూడా నీవు వాడితో ఇంగ్లీషులో మాట్లాడుతున్నావు. అంటే నీకు ఇంగ్లీషు బాగా తెలుసునని చెప్పటకోసం వాడితో మాట్లాడుతున్నావా? ఈ చిన్న విషయంలో కూడా నీ

అహంకారాన్ని ప్రదర్శిస్తూ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి అన్నారు. అంటే మనిషి యొక్క అహంకారం ఎన్ని పిచ్చి వేషాలు వేస్తుందో చూడండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 12-02-06, ముప్పర్తిపాడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మనం శివుడిని ఆరాధించినా, విష్ణువును ఆరాధించినా ఏ మొఖంలో నుండి వెళ్ళినా హృదయంలోనికి వెళతాము. కర్మయోగానికి, జ్ఞానయోగానికి కూడా భక్తి అవసరం. ఈశ్వరుడి రూపాన్ని ధ్యానించుకోవటం, ఆయన లీలలను వినటం ద్వారా మనం పవిత్రులమవుతాము. మనం పెద్దలు చెప్పిన మాటలు, మహాత్ములు చెప్పిన మాటలు శ్రవణం చేస్తున్నాము, వాటిని అధ్యయనం చేస్తున్నాము, కాళ్ళతోటి గుడుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాము, చేతులతో పూజలు చేస్తున్నాము. వీటిద్వారా మనం హృదయంలోనికి వెళుతున్నామా లేదా అనేది చూసుకోవాలి. ఎందుచేతనంటే ఈ జన్మలో అయినా, రాబోయే జన్మలో అయినా, కోటి జన్మల తరువాత అయినా జ్ఞానం అనేది హృదయంలోనే కలుగుతుంది. బాహ్యంగా మీ పరిస్థితులు బాగుండవచ్చును అంతమాత్రంచేత మీకు సుఖం కలుగదు. హృదయంలో ఉన్న వస్తువు మీకు ఎరుకలోనికి వచ్చేవరకు నిజమైనసుఖం ఎలా ఉంటుందో మీకు తెలియదు. బాహ్యవిషయాలమీద ఆధారపడి మీరు సంతోషం తీసుకొన్నప్పటికి భవిష్యత్‌లో ఇది అంతా దుఃఖంగా మారిపోతుంది. ఎందుచేతనంటే ఇది నిజంకాదు. మనం సంతోషం వస్తే పొంగిపోతాము, దుఃఖం వస్తే కుంగిపోతాము. ఇది పనికిరాదు, ఇది భక్తుడి లక్షణం కాదు అని పరమాత్మ చెపుతున్నాడు. ఆ సంతోషం నిజం కాదు, ఆ దుఃఖం నిజం కాదు కాబట్టి సంతోషం వస్తే మనం పొంగిపోకూడదు, దుఃఖం వస్తే కుంగిపోకూడదు.

మనుషులు రకరకాలుగా ఉంటారు, గుణాలు వేరుగా ఉంటాయి, రంగులు వేరుగా ఉంటాయి, ఎవరి పరిస్థితులు వారివి కాని భక్తుడు ఏమి చేయాలి అంటే అన్ని కాలాలలో, అన్ని పరిస్థితులలో అద్వైతభావన విడిచిపెట్టకూడదు. మీలో ఒకరికి ధనం ఉండవచ్చు, ఇంకొకరికి ధనం లేకపోవచ్చు, ఒకరికి బాగా చదువు ఉండవచ్చు, ఒకరికి చదువు లేకపోవచ్చు ఇవన్నీ బాహ్యవిషయాలు, కాని అందరి హృదయాలలో ఉన్న వస్తువు మాత్రం సమానంగా ఉంది, అది భక్తుడు చూడటం నేర్చుకోవాలి, అది నేర్చుకొంటే ఆ వస్తువు యొక్క దయ కలుగుతుంది. ఆ వస్తువు మనకు తెలియబడితే తెలుసుకోవటానికి మనం పనికి వస్తాము కాని బలవంతం చేసి తెలుసుకొనే వస్తువు కాదు. మన అలవాట్లయొక్క వేగం వలన,

గుణాల యొక్క వేగం వలన హృదయంలో ఉన్న పరమాత్మను మరిచిపోయాము. శరీరానికి రోగాలు వస్తాయి, మనస్సుకు రాగద్వేషాలు వస్తాయి, అవి రెండూ మనం కాదు, అవి ప్రారబ్దంను బట్టి అలా వస్తూ ఉంటాయి. పూర్వజన్మలో అనుభవించిన భోగాలే రోగాల కింద వస్తాయి. మన శరీరానికి అనారోగ్యం వచ్చింది అనుకోండి, అనారోగ్య కారణం తొలగించుకొంటే అనారోగ్యం పోతుంది. మన మనస్సుకు అశాంతి వచ్చింది అనుకోండి. ఏకారణం వలన మనస్సుకు అశాంతి వచ్చిందో ఆ కారణాన్ని తీసేసేవాడు శివుడు, వాడే రుద్రుడు. మనం కానిదానితో తాదాత్మ్యం పొందటం ఇలా అనేక జన్మలనుండి అలవాటుపడిపోయాము. సిగరెట్టు కాల్చటం, పేకాట, తాగుడు ఎలాంటి అలవాట్లో అలాగే మనం కానిది మనం అనుకోవటం ఇది కూడా ఒక అలవాటు. దేహము నేను కాకపోయినా, దేహమే నేను అనుకోవటానికి అలవాటు పడిపోయాము, ఈ అలవాటు కొన్ని వేల జన్మలనుండి వస్తోంది. ఏదో గురువు అనుగ్రహం వలన అందులోనుండి బయటపడాలి కాని లేకపోతే బయటపడలేము. పుస్తకాలు చదవటం వలన ఇది వచ్చేయదు, పరమాత్మ యొక్క దయ ఉండాలి. మన హృదయంలో ఉన్న సద్వస్తువు మనకు ఎరుకలోనికి వచ్చేవరకు ఈ అలవాట్లలో నుండి బయటకు రాలేము. ఈ అలవాట్లలోనుండి బయటపడాలి అంటే ముందు మన మనస్సు మనకు సహకరించాలి. బంధంలో పడటానికైనా, మోక్షం పొందటానికి అయినా మనస్సే కారణం. ఆ మనస్సును మనం జాగ్రత్తగా చూసుకోవాలి. నీ మనస్సు నీకు అనుకూలంగా ఉంటే నీ విరోధులు కూడా నిన్ను ఏమీ చెయ్యలేరు. మీకు అనారోగ్యం వస్తే మనస్సు సహకరిస్తే పది రోజులలో తగ్గవలసింది నాలుగు రోజులలో తగ్గిపోతుంది.

మనకు భక్తి చాలా ముఖ్యం. శ్రీకృష్ణుడి పట్ల గోపికలు చాలా భక్తిగా ఉండేవారు. విదురుడు గోపికలకు జ్ఞానం గురించి చెప్పటానికి వచ్చాడు. మీరు శ్రీకృష్ణుడి గురించి బెంగపెట్టుకొంటున్నారు. అలా కాదు సాకారంలో నుండి నిరాకారంలోనికి వెళ్ళాలి, సగుణంలో నుండి నిర్గుణంలోనికి వెళ్ళాలి. కృష్ణుడు అంటే కేవలం ఆ శరీరం కాదు, ఆత్మ, అది మీరు అర్థం చేసుకోవాలి అని చెప్పటానికి విదురుడు వచ్చాడు. మీరు ఇలా కృష్ణా కృష్ణా అని అనుకోవటం కాదు, తత్త్వం తెలుసుకోవాలని విదురుడు వచ్చి గోపికలకు చెప్పాడు. గోపికలు ఏమన్నారు అంటే నువ్వు చెప్పే మాటలు వినేవారు ఎవరూ ఇక్కడ లేరు, ఎందుకు నీకు నోటి దండగ, మాకు కాలం దండగ అన్నారు. నువ్వు ఏదో పండితుడవని నువ్వు అనుకొంటున్నావు, ఇది అంతా టైము వేస్టు అని మేము అనుకొంటున్నాము. నువ్వు ఏదో చెపుతున్నావు, మాకు చెవులు ఉన్నాయి కాని వినటానికి లోపల మనస్సు ఉండాలి, ఆ

మనస్సును మేము ఎప్పుడో కృష్ణుడికి ఇచ్చేస్తే ఇంక నువ్వు చెప్పిన మాటలు ఎవరు వింటారయ్యా? వెళ్ళిరా! అన్నారు గోపికలు. మా మనస్సు మా దగ్గర లేదు, కృష్ణుడి దగ్గర ఉంది. మేము కృష్ణుడి చుట్టూ తిరిగాము అని తెలియని వారు అనుకొంటారు. కృష్ణుడు అంటే ఆత్మ, ఆత్మ చుట్టూ తిరిగాము. నేను, నాది అనుకోవటం అజ్ఞానం, ఇది అంతా ఈశ్వరుడిదే. ఉన్నది ఆయనే అనుకొంటే జ్ఞానం అంతకంటే ఏమీ లేదు అన్నారు రామకృష్ణుడు. మనం నేను, నేను అనేది ఒక పెద్ద జబ్బు. కొంతమంది ఏమి చేస్తారు అంటే ఆ నేనును పోగొట్టుకొనే ప్రయత్నం చేయకపోయినా ఫరవాలేదు, ఆ దొంగనేనును అస్తమాను పొగుడు కొంటూ ఉంటారు, దాని వలన అది పెరిగిపోతుంది, అంటే జబ్బును పెంచేసుకొంటున్నారు, అది చాలా ప్రమాదం. దానం ఇవ్వటం వేరు, ఇచ్చాను అనుకోవటం వేరు. ఇస్తే ప్రమాదంలేదు, ఇచ్చాను అనుకోవటంలో ప్రమాదం ఉంది, దాని వలన దొంగనేను పెరిగిపోతూ ఉంటుంది. ఇవి అన్నీ మనం సూక్ష్మంగా ఆలోచించుకోవాలి. దానం చేసి దొంగనేనును పెంచుకొంటాము అనుకోండి దానివలన పుణ్యం రావచ్చు, అనుభవిస్తే అది పోతుంది.

ఉద్ధవుడు గోపికల దగ్గరకు వస్తాడు. వీరికి ఆత్మజ్ఞానం గురించి చెపితే ఎక్కటం లేదు, శివుడు కైలాసంలో ఉంటాడని, విష్ణువు వైకుంఠంలో ఉంటాడని పురాణాలు చెపుదాము అనుకొని కైలాసంలో ఇటువంటి సుఖాలు ఉంటాయి, వైకుంఠంలో ఇటువంటి సుఖాలు ఉంటాయి, స్వర్గలోకంలో ఇటువంటి భోగాలు అనుభవించవచ్చు అని గోపిలకలతో చెపుతూ ఉంటే గోపికలు ఏమంటున్నారు అంటే నువ్వు చెప్పినది నిజమే, వైకుంఠంలో చాలా సంతోషం ఉంది, కైలాసంలో చాలా సుఖం ఉంది కాని అంతకంటే ఎక్కువ సుఖం, సంతోషం ఇక్కడ మేము పొందుతూ ఉంటే నీ వైకుంఠం, కైలాసం ఎవరికి కావాలి, నువ్వు కూడా మోసుకొని వెళ్ళు అన్నారు. ఎవరి దగ్గరో ఒక రూపాయి ఉంది అనుకోండి మనం ఒక పైసా ఇస్తే వాడికి ఏమీ అనిపించదు. వాడి దగ్గర ఉన్న రూపాయిలో ఆపైస ఎన్నో వంతు. మేము అనుభవించే పరమశాంతిలో, పరమసుఖంలో నీ వైకుంఠం గొడవలు, కైలాసం గొడవలు ఏమిటి, వాటిని నీ కూడా తీసుకొని వెళ్ళు అని చెప్పారు. ఇది అంతా స్వప్నం అన్నాడు ఉద్ధవుడు. ఒకవేళ నిజంగా స్వప్నం అయినా మేము చూసేది కృష్ణుడినే అని చెప్పారు. జాగ్రదవస్థలో చూసేది కృష్ణుడినే అన్నారు. మేము స్వప్నం స్వప్నంలా చూడటం లేదు, స్వప్నంలో కృష్ణుడినే చూస్తున్నాము అన్నారు గోపికలు, అంటే వారు మహాయోగులు. ఉద్ధవుడికి మనస్సులో నేను చాలా భక్తుడిని అని ఉండేది. కృష్ణుడు ఏమి చేసాడు అంటే నాకు ఈ మధ్య గోపికలను చూడటానికి టైము ఉండటం లేదు, వారు కూడా భక్తులు, నువ్వు వెళ్ళి గోపికలను పలకరించు

అని ఉద్ధవుడిని పంపించాడు. ఆ గోపికలను చూసిన తరువాత మనకున్న భక్తి కూడా భక్తికాదని తెలిసింది, అది కృష్ణుడు చేసిన మాయ. మంచివారికి, చెడ్డవారికి తేడా ఏమిటి అంటే మంచివారు నీది నీదే, నాది కూడా నీదే అని చెపుతారు. చెడ్డవారు నాది నాదే, నీది కూడా నాదే అంటారు. ఇదే మంచివారికి, చెడ్డవారికి తేడా అని రామకృష్ణుడు చెప్పారు. భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా, ప్రేమగా చేసుకొంటూ వెళ్ళాలి. అవసరం లేని పనులు చేయకూడదు, అవసరం లేని మాటలు మాట్లాడకూడదు. మనకు భగవంతుడు తెలియకపోయినా దేహము, మనస్సు తెలుస్తోంది కదా, వీటిని జాగ్రత్తగా ఉపయోగించు కొంటూ, మన మాట, పనులు నిర్మలంగా ఉండేలా చూసుకొంటే మనకు సాత్వికబుద్ధి కలుగుతుంది. మనం రైల్వేస్టేషన్‌కు వెళ్ళకుండా రైలు ఎక్కలేము. పాలకొల్లు, నర్సాపురం మధ్య రైలు వెడుతూ ఉంటే మనం మధ్యలో చెయ్యి పెడితే రైలు ఆగదు, మనం స్టేషన్‌కు వెళ్ళి రైలు ఎక్కాలి. అలాగే మనం సాత్వికబుద్ధి లేకుండా స్వర్గరాజ్యంలోనికి ప్రవేశించలేము. ధనం సంపాదించుకొనేటప్పుడు ఎంత శ్రద్ధగా సంపాదించుకొంటున్నారో, విద్య నేర్చుకొనేటప్పుడు ఎంత శ్రద్ధగా నేర్చుకొంటున్నారో అలాగే సాత్వికబుద్ధిని అంత శ్రద్ధగా నేర్చుకొంటేనే అది వస్తుంది.

మన పని మనం శ్రద్ధగా చేసుకోవాలి, రియాక్షన్ తగ్గించుకోవాలి, మీ నిదానంలో మీరు ఉండాలి. కొంతమంది చాలా నిర్మలంగా, స్టడీగా ఉంటారు, వారికి పవిత్రత కలుగుతుంది. మన హృదయంలో ఉన్న వస్తువు ఎంత పవిత్రంగా ఉందో అంత పవిత్రత మనకు వస్తేగాని అది మనకు ఎరుకలోనికి రాదు. నువ్వు చేసే పని నిర్మలంగా చేసుకో, అపేక్ష వద్దు. వచ్చేదేదో వస్తుంది, రానిదేదో రాదు. మన చేతులు పని చెయ్యటానికే పనికి వస్తాయి, ఫలితం భగవంతుడు చేతిలో ఉంది. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ పని ఏదో నువ్వు చెయ్యి, నాపని జోలికి రాకు. నీకు అడగాలి అని ఉంటే అడుగు. నేను ఇచ్చినా ఇవ్వకపోయినా నిర్మలంగా ఉ ండు, రియాక్టు అవ్వవద్దు. నీ బుద్ధి పక్వానికి రాలేదు అనుకో ఒకోసారి నువ్వు అడిగింది ఇవ్వను, ఇస్తే పాడైపోతావు అందుచేత ఆపుచేస్తాను అంతేగాని నీమీద ఇష్టం లేకకాదు పేకాట ఆడేవాడికి భగవంతుడు దర్శనం ఇచ్చి ఒక లక్ష ఇచ్చాడు అనుకోండి, ఆ లక్ష తీసుకొని వెళ్ళి పేకాటలో పెట్టేస్తాడు. ఆ అలవాటు పెరిగిపోతుంది. దరిద్రం నేర్పేపాఠాలు కూడా ఉంటాయి. అందుచేత ఇచ్చే వాడికి ఎందుకు ఇస్తున్నాను, ఇవ్వని వాడికి ఎందుకు ఇవ్వటం లేదు అది నేను చూసుకొంటాను, ఆ గొడవ నీకు వద్దు. నువ్వు అడిగింది ఇవ్వలేదు అనుకో నా మీద ప్రేమ తగ్గించుకోవద్దు, ఇవ్వకపోవటం కూడా నీ గురించే అని అర్థం చేసుకో అని పరమాత్మ

చెపుతున్నాడు. మీ కోరికలు నెరవేరకపోయినా మీరు భగవంతుడిని ధ్యానించటం, ఆయన నామాన్ని స్మరించటం మానరు అనుకోండి, మీకు భగవంతుడి మీద ఉన్న భక్తి తగ్గటంలేదు అనుకోండి, ఆయన మీద ప్రేమతగ్గటం లేదు అనుకోండి వీరుకదా నా భక్తులు అని అప్పుడు ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. మీరు సబ్జక్టు విసరు అనుకోండి, దేవుడికి నమస్కారం పెట్టి వెళ్ళిపోతారు అనుకోండి, మనస్సు పైపొర కొంతబాగానే ఉన్నట్లు ఉంటుంది కాని లోపల పొరలు సబ్జక్టు శ్రవణం చేయకపోతే బాగుపడవు. శ్రవణం చేయటమే కాదు మననం చేయాలి. మీరు చెవులతో విన్న దానిని హృదయంలోనికి పంపాలి, అప్పుడుగాని బాగుపడరు, జ్ఞానం హృదయంలోనే కలుగుతుంది. మన బట్టలమీద దుమ్ముపడితే దులిపేసుకొంటాము అలాగే మనస్సులో చెడువాసనలు ఉంటే దులిపేసుకోండి. మనస్సులో చెడ్డ వాసనలు ఉండటంలో ఆశ్చర్యం లేదు, దాని గురించి తెలుస్తోంది కదా, దానిని ప్రయత్నం చేసి తొలగించుకోవటంలోనే గొప్ప ఉంది అంటున్నాడు పరమాత్మ. చెడ్డవాసనలను గుర్తించి వాటిని తొలగించుకొంటే ఉన్నతమైన స్థితిని, ఉదాత్తమైన స్థితిని ఇప్పడే ఇక్కడే పొందుతావు. నీకు ద్వేషం వస్తోంది అనుకో, అది నాకు తెలియకపోయినా నీకు తెలుస్తుంది కదా, దానిని ప్రయత్నం చేసి తొలగించుకోవటంలోనే నీ సాధనాబలం ఉంది, వాటిని తొలగించుకొంటే నీవు ఉన్నతస్థితికి ఎదిగి వెళ్ళిపోతావు. గాంధీగారు ఎక్కువగా బయటశుద్ధి, లోపలశుద్ధి అని రెండు మాటలు చెప్పేవారు. శరీర శుద్ధికి నీరు ఉండాలి, బుద్ధి శుద్ధి అవ్వాలంటే ప్రార్థన ఉండాలి. అస్తమాను లోకంలో గొడవలు చెప్పకొంటూ కూర్చోవటం కంటే ఒక గంట భగవంతుడిని ప్రార్థిస్తే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను లాభం పొందుతారు అని గాంధీగారు చెప్పారు.

హృదయంలో ఉన్న వస్తువుకు హద్దులు లేవు. ఏదో ఒక దేశంలో ఉండి ఇంకో దేశంలో లేకపోవటం కాదు, అది అంతటా ఉంది, అయితే ఈ హద్దులు ఎవరు తీసుకొని వస్తున్నారు? మనస్సే తీసుకొని వస్తోంది. ఇది నా దేశం, అది పరాయి దేశం, వీడు నావాడు, వాడు పరాయివాడు ఈ గొడవలన్నీ మనస్సే తీసుకొని వస్తోంది, ఆ మనస్సు గొడవ వదిలించుకో. లోపల ఉన్న చైతన్యానికి హద్దులు లేవు, అంతా తానే. మావూరికి మురికి కాలువలు తప్పించండి అంటారు. మా ఊరు, మా శరీరం, మా ఇల్లు అంటారు ఇది అంతా మనస్సు యొక్క గోల, ఈ గొడవలలో మనస్సు తగుల్కొంటోంది, అలా తగుల్కొని అక్కడ ఆగిపోతుంది, కొన్నివేల జన్మలు ఇలా ఆగిపోతుంది. ఈ మనస్సును అతిక్రమిస్తేనేగాని, దానిని తీసి ఒక ప్రక్కన పెడితేనేగాని నీకు లోపల ఉన్న చైతన్యం అనుభవంలోనికి రాదు. హద్దులు కల్పించేది మనస్సు, దాని పెంట వదిలించుకొంటేగాని హద్దులులేని వస్తువు మీకు అనుభవంలోనికి రాదు. కొంతమంది పని

మనుషులకు ఎందుకు పనికి రానివి పెడతారు. రాబోయే జన్మలలో అటువంటి వస్తువులే మీకు పెట్టిస్తాను అంటున్నాడు పరమాత్మ. పెట్టించటమే కాదు, మీ నోటితో తినిపిస్తాను అంటున్నాడు. మీరు తినేవి పని మనిషికి పెట్టవచ్చు, మీకు పనికి రానివి అన్నీ పని మనిషికి పెట్టటం ఏమిటి? ఇవి భక్తుడి లక్షణాలు కాదు అంటున్నాడు పరమాత్మ. అవసరం లేని పనులు, ఆడంబరం కోసం చేసే పనులు వదిలెయ్యండి. పని చేస్తే హృదయపూర్వకంగా చేయండి, పని చేసేసి ఏడవకండి, మీరు ఏదైనా పనిచేస్తే, ఆ క్షణంలో మీకు మరుపు వచ్చేయాలి. చేసి మర్చిపోతే మనస్సులో వాసన పడదు, వాసన లేకపోతే పునర్జన్మ లేదు. మీరు గాలి పీల్చుకొంటున్నారు, గాలి పీల్చుకొంటున్నామని జ్ఞాపకం పెట్టుకొంటున్నారా? లేదు, మీరు పని కూడా అలా చెయ్యండి, అప్పుడు మీ మనస్సులో వాసన పడదు. సృష్టికి యజమాని భగవంతుడు, ఆయనకు తెలియకుండా ఏ సంఘటన జరుగదు. మీకు ఇష్టంలేని సంఘటనలు జరిగినా ద్వేషించకండి, దూషించకండి, అది ఈశ్వరసంకల్పం అనుకోండి, మీరు సహించే స్వభావం నేర్చుకోండి, నువ్వు సహించటం నేర్చుకొంటే నీకు సత్వగుణం కలుగుతుంది, సత్వగుణం నీకు మోక్షానికి దారి చూపిస్తుంది.

ఇప్పుడు మీరు ఇక్కడ కూర్చొన్నారు అనుకోండి, మనస్సు ఇక్కడ సబ్జక్టు మీద ఉండాలి. ఇక్కడ కూర్చొని అస్తమాను ఇల్లు తలపెట్టుకొంటూ ఉంటే, ఇంటి మీద అంత మోహం ఉంటే ఇంక నీకు సబ్జక్టు ఏమి అర్థమవుతుంది. మీకు ఇల్లు ఉంది, అందులో ఉండండి అంతేగాని అస్తమాను ఆ ఇంటి గొడవలో ఉంటే, దాని మీద మమకారం పెట్టుకొంటే మీరు స్వరూపానికి దూరమయిపోతారు. ఆ ఇల్లు మనమే కట్టాము అనుకోండి మనం చనిపోయాక ఆ దేహాన్ని అందులో ఉండనిస్తారా? ఉండనివ్వరు. నువ్వు చనిపోయాక ఆ ఇల్లును నీకూడా తీసుకొనివెళ్ళనిస్తారా? లేదు. ఆ ఇల్లే కాదు, పొలం కాదు, డబ్బు కాదు, చివరకు నీ ఇంట్లో బట్టలు కుట్టే చిన్న గుండుసూదిని కూడా నీ కూడా తీసుకొని వెళ్ళలేవు అంటాడు గురునానక్. మనిషి అయ్యాక ఏదో ఊరిలో, ఏదో ఇంటిలో ఉంటాడు. వాటి మీద మమకారం పెట్టుకొంటే ఆ మమకారం తొలగించుకోవటానికి మరల సాధన చెయ్యాలి. 24 గంటలు నీ మనస్సును పుండుచేసుకొంటూ ఉంటే నీవు నాకు భక్తుడివి ఎలా అవుతావు. నాకు భక్తుడవు కాదు అనుకో నాకు ప్రియుడవు ఎలా అవుతావు, నాకు ప్రియుడవు కాకపోతే నా స్వరూపం నీకు ఎలా దొరుకుతుంది. నీవు పనిచేసేటప్పుడు చేతులు పనిమీద, నీ మనస్సు నామీద ఉంటే, నన్ను స్మరించుకొంటూ పనిచేస్తూ ఉంటే నీ బుర్రలో ఉన్న దోషాలు, పాపపు ఆలోచనలు ఉంటే అన్నీ బయటకు పోతాయి అంటున్నాడు పరమాత్మ. సాధన చేస్తే పాపపు

ఆలోచనలు, బలహీనతలు ఎలా పోతాయో గురువు శిష్యుడికి బోధిస్తున్నాడు. ఆ బోధ అంతా విని వెళ్ళి గురువును ముట్టుకొన్నాడు. నిన్ను ముట్టుకొన్నాక అన్నీ పోయినాయి ఇంక సాధన ఎందుకు అన్నాడు. నిప్పు మీద మిడతలు పడ్డాక ఆ మిడతలు బతుకుతాయా? నిన్ను ముట్టుకొన్నాక నాకు పాపాలు ఏమిటి అన్నాడు అంటే పరిపూర్ణమైన విశ్వాసం. మీరు శ్వాస మీద ఆధారపడి బతకకండి, విశ్వాసం మీద ఆధారపడి బతకండి అన్నారు గాంధీగారు. శ్వాస ఇవాళ ఉంది రేపు పోవచ్చు కాని విశ్వాసం అలాకాదు, అది రాబోయే జన్మకు కూడా వస్తుంది.

ఓ అరుణాచలేశ్వరుడా! భౌతికమైన ప్రేమలలో తల్లి ప్రేమ గొప్పదికాని నీ ప్రేమ ముందు తల్లి ప్రేమకూడా సరిపోదు, నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమా! అంటే గురువు యొక్క దయ ఒక్కసారి మనకు కలిగితే మన జీవితాన్ని ఎలా నడిపించాలి, ఎప్పుడు మన జీవితాన్ని మలుపు తిప్పాలి, ఎప్పుడు మనకు మోక్షాన్ని ప్రసాదించాలి అంతా ఆయనే చూసుకొంటాడు. మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, సహనంతో, ప్రేమతో చేస్తూ ఉంటే ఆయన చేతిలో ఉన్న పని గురించి మనం జ్ఞాపకం చేయనక్కరలేదు, ఎప్పుడు ఎక్కడ ఎలా చేయాలో ఆయనే నిర్ణయించుకొంటాడు, వాడే ఈశ్వరుడు. సూర్యుడు ఉదయిస్తేనే గాని చీకటి బయటకు పోదు. అలాగే ఈశ్వరానుగ్రహం లేకుండా మనలో ఉన్న అజ్ఞానం బయటకు పోదు. మీకు బాహ్యపరిస్థితులు అన్నీ బాగున్నా గర్వం తెచ్చుకోవద్దు. గర్వం ఎప్పుడైతే వచ్చిందో పతనం ప్రారంభమవుతుంది. మీ కళ్ళలో దోషం వస్తే గుడ్డితనం ప్రారంభమవుతుంది, మనస్సులో మమకారం పెరుగుతూ ఉంటే మనస్సుకు గుడ్డితనం పెరుగుతుంది. నా మాటయందు నీకు గౌరవం ఉంటే, నా ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకొంటే, నా నామాన్ని స్మరిస్తూ ఉంటే, నన్ను ధ్యానిస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని నీకు ఇస్తే మోక్షం కలుగుతుందో అటువంటి బుద్ధిని నాచేతితో నీకు ప్రసాదిస్తాను, నీ పాడుబుద్ధిని తీసేసి సద్బుద్ధిని, సహృదయాన్ని కలుగజేసే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 19-04-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏకాంతవాసం, సహవాసం, ఉపవాసం ఇవన్నీ మంచివే. ఉపవాసం శరీర ఆరోగ్యానికి, సహవాసం మానసికఆరోగ్యానికి, ఏకాంతవాసం మన మనస్సులో ఏముందో మనం తెలుసుకోవటానికి సహకరిస్తాయి. మనకు కోరికలు లేకపోతే ఏకాంతంగా ఉండగలము. ఏకాంతవాసంలో మనం భగవంతుడిని ఉపాసించటం వలన ఏకాగ్రత పెరుగుతుంది. మీరు సబ్జక్టు అర్థం చేసుకొంటే ఈ జన్మలోనే తరించగలరు, సబ్జక్టు అర్థం చేసుకోకుండా సాధన

చేసినా ప్రయోజనం ఉండదు. అసలు 10% సాధన, మిగతా 90% అండర్‌స్టాండింగ్‌లోనే రావాలి. సత్వగుణం పెంచుకోవటానికి ప్రయత్నం చేయాలి. సత్వగుణం లేకుండా ఆత్మజ్ఞానం రాదు. సాపేక్షకజ్ఞానం వేరు, ఆత్మజ్ఞానం వేరు. సాపేక్షకజ్ఞానం అంటే మనస్సుతో సంపాదించేది. సాపేక్షకజ్ఞానం వలన శరీరయాత్ర నడుస్తుంది కాని మోక్షం రాదు. ఎక్కడైతే మనస్సు అణుగుతుందో అక్కడ నుండి ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మజ్ఞానం వలన మోక్షం వస్తుంది. ఆత్మజ్ఞానం వలన పునర్జన్మలేని స్థితిని పొందుతాము. సాపేక్ష జ్ఞానం అంటే నేర్చుకొనే వాడు ఒకడు ఉండాలి, నేర్చుకోవటం అనేది ఒక పని, ఆ నేర్చుకొనే సబ్జక్టు అక్కడ మూడు వస్తున్నాయి. దీనివలన కూడా ప్రయోజనం ఉంది. ప్రపంచంలో ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎవరితో ఎలా మెలగాలి అనేది తెలుస్తుంది. అందరికి శరీరం ఉంది కదా, శరీరం ఉన్నంతసేపు ఏదో ఒకటి తినాలి, దానికి నీడ ఉండాలి, బట్ట ఉండాలి. కొంత సాపేక్ష జ్ఞానం లేకుండా పొట్టగడవదు, బట్ట, నీడ ఉండవు. కాని మన శరీరం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో సాపేక్ష జ్ఞానం కూడా అంతే నిజం. ఆత్మజ్ఞానం దేహంతో, లోకంతో సంబంధం లేనిది, అది మోక్షాన్ని ఇస్తుంది. ఆత్మజ్ఞానం కలిగితే నువ్వు ఇతరులతో సంబంధం లేకుండా స్వతంత్రమైన సుఖంలో, ఆనందంలో, శాంతిలో ఊగిసలాడతావు. అసలు పూర్వజన్మలు లేవు, రాబోయేజన్మలు లేవు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఈ జన్మలు కూడా స్వప్నంతో సమానము అన్న సంగతి నీకు ఆత్మజ్ఞానం వలన అనుభవంలోనికి వస్తుంది. ప్రతీ మనిషికి తన అనుభవం తనకు వచ్చేవరకు ఏదో సందేహం, ఏదో అనుమానం, ఏదో పీడ వెంటాడుతూ ఉంటుంది. ఉన్నది ఏదో ఉంది, అది అన్నికాలాలలో ఉంది, అంతటా ఉంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వస్తే, ఈ జన్మలు అంతా అసత్యం అని అప్పుడు నీకు అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు మీరు ఇతరులు చెప్పే మాటలమీదగాని, శాస్త్రం మీదగాని ఆధారపడనక్కరలేదు.

లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, ఏ ఆకర్షణకు మనం లోబడినా మనస్సుకి అంతర్‌దృష్టి కలుగదు. అంతర్‌దృష్టి లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనిషి ఒకే టైములో దేవుడిని, డబ్బుని ఆరాధించలేడు. దేవుడిని ఆరాధించే వాడు డబ్బును ఆరాధించలేడు, డబ్బును ఆరాధించేవాడు దేవుడిని ఆరాధించలేడు. నీ హృదయంలో ధనానికాస్థానం, దేవుడికాస్థానం, నీవు ఏమి కోరుకొంటున్నావో చూసుకో. త్యాగరాజు భక్తుడు అని తెలిసి ఒక రాజుగారు కొంతధనం, బంగారం పంపాడు. పంపిన ధనాన్ని, బంగారాన్ని ఎదురుగుండా పెట్టుకొని రామా! ఓ శ్రీరామా! ఈ నిధి సుఖమా, నీ సెన్నిధి సుఖమా అంటాడు. నీకు బంగారం కావాలంటే ఎదురుగా ఉంది తీసుకో, నీకు రాముడి సన్నిధి కావాలంటే ఈ బంగారాన్ని వదిలెయ్యి,

నీకు ఏది కావాలంటే అది తీసుకో అని తన మనస్సుతో తానే చెప్పకొంటున్నాడు. నిధిలో ఏమీ లేదు, ఇది అంతా మాయ, ఆయన సన్నిధే సుఖం అని లోపల నుండి సందేశం వచ్చింది, ఈ సంఘటన తరువాత ధనం, బంగారాన్ని పంపేసాడు. అప్పటివరకు త్యాగరాజు, ఆయన అన్నగారు స్నేహంగా ఉండేవారు, ఇప్పుడు పేచీలు ప్రారంభమైనాయి. వాడికి అక్కర లేకపోతే ఆ ధనం, బంగారం నాకు ఇవ్వవచ్చు కదా అని అప్పటి నుండి పేచీలు ప్రారంభమైనాయి, ఈ బంగారం పేచీలకు దారితీసింది. రామకృష్ణపరమహంస శరీరం విడిచిపెట్టాక శారదామాత పుట్టింటికి వెళ్ళిపోయారు. పూర్వపు భక్తులు శారదామాతకు పళ్ళు తెచ్చి ఇస్తూ ఉండేవారు. శారదామాతకు అయిదుగురు తమ్ముళ్ళు ఉండేవారు. నాకు తెచ్చిన పళ్ళు అన్నీ నేను ఏమి చేసుకొంటాను అని ఇంటిదగ్గర ఇచ్చేసేవారు, ఆ పళ్ళకోసం మరదళ్ళు రోజూ పేచీలు పెట్టుకొనే వారు అని శారదామాత చెప్పారు. ఇంతాచేస్తే తినే పళ్ళకోసం, మాయ అంటే ఇలా ఉంటుంది.

సముద్రంలో నీరు ఉప్పగా ఉంటుంది, అది ఎంత తాగినా దాహం తీరదు, దాహం పెరుగుతూ ఉంటుంది. ధన కాంక్ష, కీర్తి కాంక్ష, సముద్రంలో నీరు వంటివి అని మిల్టన్ చెప్పాడు. మీరు కీర్తి సంపాదించే కొలది కీర్తి కాంక్ష, ధనం సంపాదించే కొలది ధనకాంక్ష పెరుగుతూ ఉంటాయి. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని మనం అనుకోవటం వలన మనస్సు బయటకు వచ్చేస్తుంది. బాహ్యాఆకర్షణల వలన మనస్సును లోపలకు పంపలేక పోతున్నాము. ఏసుక్రీస్తు దగ్గరకు 30 సం॥లు వయస్సు ఉన్నవాడు ఒకడు వచ్చాడు, ఎమోషన్‌లో ఉన్నాడు. నాకు ఏమీ అక్కరలేదు, నువ్వే చాలు ప్రభువా అంటున్నాడు. నువ్వే నాకు దిక్కు, నన్ను రక్షించడానికి నువ్వు చాలు అంటున్నాడు. ఆ మాటలు నిజం కాదు, ఆ వైరాగ్యం నిజం కాదు అని ప్రభువుకు తెలుసు. అతనికి ఆస్తి ఉందని ఏసుక్రీస్తుకు తెలుసు. నీ ఆస్తిని అమ్మేసి ఆ డబ్బు నా దగ్గరకు తీసుకొని రానక్కరలేదు. మీ గ్రామంలో ఉన్న పేదలకు పంచిపెట్టేసి అప్పడు నువ్వు నా దగ్గరకు రా, నన్ను అనుసరించు అని చెప్పాను, వాడు తిరిగి నాకు కనబడలేదు అని ఏసుక్రీస్తు అన్నారు. డబ్బు ఉందని మీరు అవసరం లేని ఖర్చులు పెంచుకొన్నారు అనుకోండి, డబ్బు ఉన్నవాళ్ళకింద కనబడాలని ఖర్చులు పెడుతున్నారు అనుకోండి మీరు పేదవారు అయిపోతారు. కొంతమంది ఎలా ఉంటారు అంటే నాలుగు వస్తువులు అవసరమైతే ఒక్క వస్తువుతో కాలక్షేపం చేస్తారు, ఖర్చుల దగ్గర బహుజాగ్రత్తగా ఉంటారు, వారు పేదవారికింద మనకు కనబడుతూ ఉన్నా ధనవంతులు అయిపోతారు. మీకు నిజంగా ధనం ఉన్నా లగ్జరీస్ పెంచుకోవద్దు. కొంతమంది వారి అవసరాలకు ఎంత డబ్బు అయినా ఖర్చు పెట్టుకొంటారు కాని పక్కవారికి ఒక్కపైసా ఖర్చుపెట్టరు. అది పాపాన్ని

తీసుకొని వస్తుంది. వారికి ఉన్న కోరికను సంతృప్తి పరచుకోవటం కోసం ఖర్చు పెట్టటం లేదు, అక్కడ అవసరం ఏమిటో తెలుసుకొని దయ చూపించు, అక్కడ ఖర్చుపెట్టు, అది పుణ్యాన్ని తీసుకొని వస్తుంది. మీరు శివాలయానికి వెళ్లి శివుడిని పూజించవచ్చు, విష్ణు ఆలయానికి వెళ్లి విష్ణువును పూజించవచ్చు, చర్చికి వెళ్లి క్రీస్తును పూజంచవచ్చు, ఎవరికి ఇష్టమైన దేవుడిని వారు పూజించుకోవచ్చు, భక్తులు అంటే కేవలం అది కాదు, అందరి హృదయాలలో నివాసంగా ఉన్న ఈశ్వరుడిని ఎవడైతే దర్శించగలుగుతున్నాడో, వాడే నిజమైన భక్తుడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారు సహృదయంతోటి, సద్బుద్ధితోటి ఒక మంచి పని కూడా చేయరు, కాని వారు గొప్పవారు అని లోకం అనుకోవాలి, ఇవి అన్నీ పిచ్చి చేష్టలు.

నాకు పునర్జన్మ వస్తుందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. లోపల అజ్ఞానం ఉన్నప్పుడు పునర్జన్మ వస్తుంది. మనం కాని దానిని మనం అనుకోవటమే అజ్ఞానం. మీకు దేహం వచ్చిందా మీరు బంగారంతో కట్టిన ఇంట్లో ఉన్నప్పటికీ దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది, ఎవరూ దుఃఖంలో నుండి తప్పించుకోలేరు. జ్ఞానం వలన దుఃఖం నశిస్తుంది కాని ధనం వలన దుఃఖం నశించదు. మీ ఇంటికి దొంగలు వచ్చారు అనుకోండి, మీ ఇంట్లో ఉన్న వస్తువులను పట్టుకొనిపోతారు, అలాగే మీ ఇంట్లో ఉన్న దుఃఖాన్ని, మీ మనస్సులో ఉన్న దుఃఖాన్ని తీసుకొనిపోయేవాడు గురువు. ఏదో కార్యక్రమం గురించి చెపుతూ నేను దానికి రెండు లక్షల రూపాయలు ఇచ్చాను అని చెప్పారు. మీరు బాగా ఇచ్చారు అంత ఇస్తారనుకోలేదు అని నేను అన్నాను. ఆ కళ్యాణమండపానికి నా పేరు పెట్టండి అని ముందే మాట్లాడుకొని ఇచ్చాను అని చెప్పారు. నీ పేరు నువ్వు మర్చిపోలేవు, నీ రూపాన్ని, నీ గౌరవాన్ని నీవు మర్చిపోలేవు ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? చివరకు మిగిలేది గోడల మీద పేర్లు, అసలు సున్న. నువ్వు ఎన్ని గ్రంథాలు చదివినా, నీకు ఎంత పాండిత్యం ఉన్నా, నీవు ఎంత సాధన చేసినప్పటికీ రూపబుద్ధి, నామబుద్ధి నశించనంతవరకు నీకు ఆత్మజ్ఞానం కలుగదు. నేను జిన్నూరులో ఉన్నప్పుడు పాలకొల్లులో లేను అనుకొంటాడు, పాలకొల్లులో ఉన్నప్పుడు జిన్నూరులో లేను అనుకొంటాడు, ఎక్కడైతే దేహం ఉందో అక్కడే ఉన్నాను అనుకొంటాడు. ఆ దేహబుద్ధి ఉన్నంతకాలం ఈ శవం చనిపోయినా ఇంకో శవం వస్తుంది. చనిపోయేవాడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. చనిపోతున్నాను అనుకొంటున్నాడు కాబట్టి వాడు పుడతాడు. పుట్టినవాడు నేను పుట్టాను, నేను పుట్టాను అనుకొంటున్నాడు, నేను పుట్టాను అనుకొంటున్నాడు కాబట్టి వాడు పుడతాడు. పుట్టినవాడు నేను పుట్టాను, నేను పుట్టాను అనుకొంటున్నాడు,

నేను పుట్టాను అనుకొంటున్నాడు కాబట్టి, ఆ పుట్టిన వాడు చనిపోతాడు. బ్రహ్మం నేను పుట్టాను అనుకోదు, నేను చనిపోతున్నాను అనుకోదు, అది జననమరణాలకు అతీతం. చైతన్యం మూడు అవస్థలలోను ఉంది, అది సరళంగా ఉంది, సహజంగా ఉంది, అదే మనం అయి ఉన్నాము. అహంకారం గాఢనిద్రలో లేదు. అహంకారంతో సంబంధం లేకుండా గాఢ నిద్రలో ఉన్నావు. జాగ్రదవస్థలోనికి రాగానే అహంకారం వచ్చి ఒక దేహంతోటి, ఒక కులంతోటి, ఒక దేశంతోటి, రంగుతోటి ఇలా దేనితో ఒకదానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటుంది, ఆ తాదాత్మ్యం పొందేదానికే పునర్జన్మలు వస్తాయి. గాఢనిద్రలో అహంకారం లేకుండా ఏదైతే ఉందో దానికి పునర్జన్మలు లేవు.

మేము కష్టాలు పడుతున్నాము, మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి ఇలా అనుకోవటం అంతా అహంకారమే. దీనికి అసలు సత్యానికి ఏమీ సంబంధం లేదు. దేహగతమైన చరిత్ర వల్లకాటితో ఆగిపోతుంది, జీవుడు ఆగడు, వాడు ప్రయాణం చేసి ఇతర లోకాలకు వెళ్ళిపోతాడు, అక్కడ కర్మానుభవం అయ్యాక మరల శరీరం ధరించి వస్తాడు. ఇది బుద్ధుడిని అడిగితే శరీరం చనిపోయిన తరువాత ఎవడైతే ప్రయాణం చేసి వెళుతున్నాడని అనుకొంటున్నారో వాడు ఇప్పుడు కూడా లేడు, నువ్వు విచారణ చేసి వాడు లేడన్న సంగతి తెలుసుకొంటే నిర్వాణసుఖాన్ని పొందుతావు, అప్పుడు ఇంక శవాలను మోయవలసిన పనిలేదు. కిరసనాయిలు దీపాన్ని మనం ప్రత్యేకంగా ఆర్పనక్కరలేదు, లోపల కిరసనాయిలు అయిపోతే అదే ఆరిపోతుంది అలాగే మన లోపల ఉన్న జీవలక్షణాలు అన్నీ పోతే ఆ జీవుడు నశిస్తాడు, లోపల ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నేను పుట్టకముందు ఎక్కడ ఉన్నాను అని ఎవరు అడగరు, నేను చనిపోయిన తరువాత ఎక్కడకు వెళతాను అని అడుగుతారు, కారణం ఏమిటి? దేహము నేను అనుకొంటాడు, దేహం లేనప్పుడు నేను లేను అనుకొంటున్నాడు. అందుచేత దేహం పోయిన తరువాత ఎక్కడికి వెళతాను అని అడుగుతున్నాడు. దేహము లేనప్పుడు కూడా వాడు ఉన్నాడు అన్న సంగతి తెలియక నేను ఎక్కడనుండి వచ్చాను అని వాడు అడగడు, ఎక్కడికి వెళతాను అని అడుగుతాడు అంటే వాడి అస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసుకొంటున్నాడు. గాఢనిద్రలో నుండి మెలుకువ రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది, తరువాత ఇతర తలంపులు వస్తాయి. ఏ తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయో ఆ తలంపు నశించే వరకూ నిన్ను పునర్జన్మలు, స్వర్గలోకాలు, కర్మ సిద్ధాంతం అన్నీ వెంటాడతాయి. భగవంతుడికంటే మనం వేరుగా ఉన్నాము, మనం ఏదో సాధించేసాము అనుకోవటం వలననే అజ్ఞానం పెరుగుతుంది. భగవంతుడు ఇస్తే మనకు వచ్చింది అని తెలియక మనం ఏదో సంపాదించేసాము అనుకొంటాము, దాని వలన

అజ్ఞానం పెరుగుతుంది. మీరు ఏదో కష్టపడ్డారు, సంపాదించాము అనుకొంటున్నారు. మీకంటే వందరెట్లు కష్టపడ్డవారు ఉన్నారు కదా మరి వారు ఎందుకు ధనవంతులు అవ్వలేదు. మీకు ఏది వచ్చినా అది ఈశ్వరుడి ఆజ్ఞను బట్టే వస్తుంది కాని లేకపోతే అది రాదు. సత్యం తాలుక అనుభవం నీకు లేకపోవటం వలన ఏదో వచ్చేసింది, జన్మలు వచ్చేస్తున్నాయి అనుకొంటున్నారు, ఈ జీవుడు ఎంత నిజమో జన్మలు కూడా అంతే నిజం, ఇవన్నీ వ్యవహారిక సత్యాలు మాత్రమే.

నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటం మానివేసి రాబోయే జన్మలు ఎటువంటివి వస్తాయి, ఏ లోకానికి వెడతాము అని తెలుసుకొన్నా ప్రయోజనం లేదు, ఇది అంతా అజ్ఞానమే. నువ్వు కాని ఈ శరీరంలో నుండి, నువ్వుకాని ఈ మనస్సులో నుండి, నువ్వు కాని ఈ జన్మలలో నుండి, బంధంలో నుండి విడుదలపొందాలంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవాలి, దానిని తెలుసుకొనే వరకు నువ్వుకాని దానిలోనుండి నీవు విడుదల పొందలేవు, అప్పటివరకు నీకు స్వేచ్ఛ లేదు, సుఖంలేదు, శాంతి లేదు. మనిషిని నీడ ఏవిధంగా అయితే వెంటాడుతుందో అలాగే దేహగతమైన నేనుతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం అది కల్పించిన గొడవలు అన్నీ నిన్ను వెంటాడుతాయి. కొంతమంది జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకొంటూ దుఃఖపడుతూ ఉంటారు, వర్తమానకాలాన్ని వదిలేస్తారు. గతానికి సంబంధించిన బరువు మోయటం కంటే రోడ్డు రోలరును మొయ్యటం మంచిది. గతాన్ని స్మరించుకోవటం వలన మీకు కలిసివచ్చేది ఏమీలేదు. వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకోండి, ఆత్మజ్ఞానం సముపార్జించండి. కష్టపడి పనిచేసుకొనే వాడికి గతం గుర్తుకురాదు, సోమరితనానికి అలవాటుపడినవాడికే గతం గుర్తుకు వస్తుంది. నిన్ను నీవు పొగుడుకోవద్దు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనలను మనం పొగుడుకొంటే మిధ్యానేను పెరిగిపోతుంది. నీకు మంచితనం ఉంటే, నీకు వివేకం ఉంటే సరిపోదు, నీవు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోవాలి. దేహభావన అంత తొందరగా నశించదు. అటు తోలితే ఇటువస్తుంది, ఇటు తోలితే అటు వస్తుంది. అందుచేత బహుకాలం నుండి వస్తున్న వాసనలను తొలగించుకోవాలంటే, నీవు బహుకాలం సాధన చేస్తేగాని అవి నశించవు.

ప్రతీ మనిషికి దుఃఖం వస్తోంది, నా దుఃఖానికి మా అత్తగారు కారణం, మావగారు కారణం, ఎవరో ఇతరులు కారణం అనుకొంటున్నాము. నీ దుఃఖానికి ఇతరులు కారణం అని తెలుసుకోవటానికి జ్ఞానం అక్కరలేదు, నీ దుఃఖానికి నీవే కారణం అని తెలుసుకోవటానికి జ్ఞానం అవసరం. దుఃఖం అనేది దేహభావన రూపంలో ఉంది. అహంభావన లేకుండా

దేహభావన రాదు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట అహంభావన వస్తుంది, అహంభావన వచ్చిన వెంటనే దేహభావన వస్తుంది, ఏ భావన వచ్చిన తరువాత ఇతర భావనలు వస్తున్నాయో ఆ భావన తొలగేవరకూ, ఆ భావన వేరుతో సహా నశించే వరకు నీకు పునర్జన్మలు వస్తూనే ఉంటాయి, దుఃఖం వెంటాడుతుంది. దేహం వచ్చిందంటే దుఃఖం వస్తుంది. బ్రహ్మంను తెలుసుకోవాలి అని నూటికి నూరుపాళ్ళు మన మనస్సు దాని మీద నిలబడుతూ ఉంటే, దాని మీద తప్ప మన మనస్సు ఎక్కడా వాలకుండా ఉంటే వాడికి బ్రహ్మం ఎరుకలోనికి వస్తుంది. నాకు ప్రపంచంలో గొప్పలు కావాలి, అంతస్థులు కావాలి, గౌరవాలు కావాలి, దేవుడిని పట్టుకోవాలి అంటే ఎలా కుదురుతుంది. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఈశ్వరుడు తెలియబడడు.

నీ మనస్సుతోటి ఏదీ ఊహించుకోవద్దు, కల్పించుకోవద్దు, నీవు కల్పించుకొనేది, ఊహించుకొనేది అంతా మాయే. ఈశ్వరుడి సంకల్పాన్ని బట్టి జరుగుతుంది కాని మీ ఊహలను బట్టి ఏదీ జరగదు. మనందరం తెగిపోయిన గాలి పటాలలాగ లేము, మన దారం ఈశ్వరుడి చేతిలో ఉంది. ఆడించేవాడు ఆయన, ఆడేవారం మనం. ఈ సృష్టి అంతా ఏ హృదయంలో నుండి అయితే వచ్చిందో మనం కూడా అక్కడ నుండే వచ్చాము. తిరిగి అక్కడకు వెళితేగాని హృదయంలో ఉన్న నిజం మనకు తెలియదు. నువ్వు అనుకొన్నది నిజం కాదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీకు ఎరుకలోనికి వచ్చేవరకు నిన్ను దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది, పునర్జన్మలు వెంటాడతాయి. మనం తలుపులు వేసుకొని గదిలో నిద్రపోతాము. మన మనస్సు ఎక్కడో విమానాలలో తిరుగుతుంది, కువైట్ వెళ్ళిపోతుంది, నీ శరీరం కువైట్ వెళ్ళలేదు గాని ఈ విమానాలు మనస్సే కల్పించింది, కువైట్ మనస్సే కల్పించింది, స్వప్నం కూడా మనస్సుకే, మీరు గడపదాటి బయటకు వెళ్ళలేదు, ప్రయాణం మనస్సులో చేసారు. అలాగే గతించిన జన్మలు, రాబోయే జన్మలు కూడా నీ మనస్సులో కల్పించబడుతున్నాయి గాని నిజంగా లేవు. ఈ మనస్సు కనుక చిరిగిపోతే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, అదే మోక్షం. ఆత్మానందం పొందటానికి నీ శరీరం చనిపోయే దాక ఆగనక్కరలేదు. సబ్జక్టు అర్థం చేసుకొంటే ఇప్పుడే ఇక్కడే కాలు కదపకుండా, చేతులు కదపకుండా వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. నిన్ను నీవు తెలుసుకోవటమే జ్ఞానం, నిన్ను నీవు తెలుసుకోకుండా ఎన్ని తెలుసుకొన్నా అది జ్ఞానం కాదు, అది అజ్ఞానమే, అజ్ఞానం అని పూరుకోలేదు ఒకటి లేని సున్నలు అని చెప్పారు. మనం ఈ లోకంలోనికి వచ్చిన జాడ తెలియకుండా వెళ్ళిపోతే రూపబుద్ధి తగ్గుతుంది, నామబుద్ధి తగ్గుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10-09-06 | ఆది | గోడిపాలెం |
| 11-09-06 | సోమ | మాగం (తూ॥గో॥ జిల్లా) |
| 01-10-06 | ఆది | జిన్నూరు |
| 03-10-06 | మంగళ | నర్సాపురం, తెలగ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# విచక్షణా జ్ఞానం

'విచక్షణా జ్ఞానము' అనగా యుక్తాయుక్త వివేకము పరమాత్మచే కేవలం మానవులకు మాత్రమే ప్రసాదింపబడిన అపూర్వ వరం. పశు, పక్ష్యాదులకు లేని కేవలం మానవులకే ప్రసాదింపబడిన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించుకొని బంధ, మోహ భ్రాంతి నుండి విడుదలపొంది అమృతత్వాన్ని పొందాలి. చెడు నుండి మంచికి, తప్పు నుండి ఒప్పుకు, అసత్తు నుండి సత్తుకు, అజ్ఞానము నుండి జ్ఞానమునకు, మృత్యువు నుండి అమృతత్వము పొందుటకు ఈ విచక్షణా జ్ఞానాన్ని తప్పక ఉపయోగించుకోవాలి. ఒక గీటురాయిలాగ 'విచక్షణా జ్ఞానాన్ని' సంసార సాగరాన్ని దాటుటకు ఉపయోగించు కొననిచో ప్రసాదింప బడిన ఒక అద్భుత అవకాశమును కోల్పోయిన వారమవుతాము. ప్రతి ఒక్కరము పూర్వ జన్మల ప్రారబ్ధ కర్మల ఫలితంగా ఒక దేహం ధరించి భూమి మీదకు వచ్చాము. అట్లే దేహము మరణించినప్పడు మనము ప్రోగుచేసుకొన్న సంస్కారములు, వాసనలు తప్ప ఏ భౌతిక వస్తువు మరణానంతర జీవితంలో మన కూడా రాదు. అందువల్ల విచక్షణతో కూడిన విచారణతో ఏది ఆత్మ - ఏది అనాత్మ, ఏది యుక్తము - ఏది అయుక్తము, ఏది నిత్యము - ఏది అనిత్యము, ఏది సత్యము - ఏది అసత్యము అని నిరంతరం మననం చేసుకొంటూ వ్యక్తిభావనను త్యజించడం ద్వారా స్వస్థితిలోకి మేల్కోవాలి.

– చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం

# గీతా సందేశం

ఉపనిషత్తుల సారాంశమే గీతా సందేశం. ఆత్మజ్ఞానం అత్యుత్తమమైనది. అయినప్పటికీ కర్మలు ఆచరించకుండా ఈ భూమి మీద ఎవ్వరూ జీవించలేరు. ఎవడు కర్మలో అకర్మను చూస్తాడో, అకర్మలో కర్మను చూస్తాడో అతడే మానవుల్లో శ్రేష్ఠుడు, బుద్ధిమంతుడు, మహాయోగి, సర్వకర్మకర్త అంటాడు గీతాచార్యుడు. "బ్రహ్మజ్ఞానమే ఉత్తమమైనది అని చెపుతున్నావు మరి నన్ను కర్మలను ఆచరించమని ప్రోత్సహిస్తున్నావు ఎందుకు కృష్ణా!" అని అడుగుతాడు అర్జునుడు. అందుకు భగవానుడిలా చెపుతున్నాడు "పార్థా! సాంఖ్యులకు జ్ఞానయోగం, యోగులకు కర్మయోగం అనాదినుండి వస్తున్నవి. ప్రకృతికి వశుడై ప్రతి వ్యక్తి కర్మలు చేస్తూంటాడు. ఎవరు మనస్సుచేత ఇంద్రియాలను నిగ్రహించుకొని, సంగరహితుడై కర్మయోగాన్ని ఆచరిస్తాడో అతడు విశిష్టుడు. నీవు ముక్తుడివి అయినా సరే పరోపకారార్థం కర్మలను చేయవలసిందే. శ్రేష్ఠుడు ఏది ఆచరిస్తాడో, సామాన్యుడు దానిని అనుసరిస్తాడు. మూడు లోకాల్లో నాకు చేయవలసింది కాని, పొందవలసింది కాని ఏమీ లేకపోయినా నేను కర్మలను ఆచరిస్తున్నాను. క్షణకాలమైనా నేను కర్మలు ఆచరించకపోయినట్లైతే లోకులు నశిస్తారు. అందుచేతనే నేను కర్మలు ఆచరిస్తున్నాను. నీవు కూడా కర్మయోగాన్ని అవలంభించు" అన్నాడు.

భగవద్గీత సిద్ధాంత గ్రంథం కాదు. కర్మ, భక్తి, జ్ఞాన, యోగాలను సంయోజనం చేసిన సమన్వయ గ్రంథం. కర్మయోగం అంటే మనకు నచ్చినపని, మనం మెచ్చినపని చేయటం కాదు. భగవంతుని మీద అనన్యభక్తితో, భగవంతుని కోసం, భగవంతుని ఇచ్ఛననుసరించి కర్మలు ఆచరించటం. నిష్కామకర్మయోగం ద్వారా జ్ఞానాన్ని పొంది, కర్మ జ్ఞానాల ద్వారా భగవంతునికి శరణాగతులై, ఆయన చైతన్యంలో తన చైతన్యాన్ని, ఆయన ఇచ్ఛలో తన ఇచ్ఛను ఏకం చేసి ఆ స్థితిలో కర్మచేయమని గీతా సందేశం. గీత కర్మ సన్యాసాన్ని బోధించటం లేదు. వ్యక్తిత్వాన్ని వదులుకొని పరమాత్మతో మమైకం కావాలంటోంది. అట్టి ఆత్మ సమర్పణ భావం అంత తేలికగా అలవడదు. దానికి ఎంతో సాధన కావాలి. ఆత్మ సమర్పణకి కర్మ, జ్ఞానాలు రెండూ సమానంగా ఆధారం కావాలి. ఇదే గీతా సందేశం.

- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్